ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక
8 పేజీలు | శుక్రవారం 08 మార్చి 2024 | www.navatelangana.com

అతివకు అందలం..!

- స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు అమలు
- ఉమ్మడి జిల్లాలో సగం మంది ప్రజాప్రతినిధులు వారే
- చట్టసభల్లోనూ 33శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం
- ఓట్ల పరంగానూ వారిదే ఆధిపత్యం

అవనిలో సగం..ఆకాశంలో సగం..అన్నింటిలోనూ సగభాగం వారిదే. ప్రస్తుతం ఏ రంగమేగినా..అన్నింటిలోనూ వారి హవా కనిపిస్తోంది. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఆకాశయానంలో విహరించే స్థాయికి ఎదిగారు. విమానాలు, రైళ్లు నడపడమే కాకుండా.. అంతరిక్షంలోనూ అడుగిడుతున్నారు. ఇటీవల చంద్రయాన్ విజయంలోనూ భాగస్వాములయ్యారు. మరోపక్క రాజకీయాల్లోనూ సత్తాచాటుతూ పాలకులుగా రాణిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని స్థానిక సంస్థల్లో సగం మంది ప్రజాప్రతినిధులు వారే కావడం విశేషం. మరోపక్క ఇటీవల మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించింది. అమలు కావడమే తరువాయిగా మారింది. దీంతో చట్టసభల్లోనూ వారికి 33శాతం రిజర్వేషన్ అమలు కానుంది. దీంతో దేశ పరిపాలనలోనూ వారికి ప్రముఖ స్థానం లభిస్తుంది. మరోపక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల సంఖ్యాపరంగానూ వారిదే ఆధిపత్యం కొనసాగడం గమనార్హం. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

▶ వివరాలు 3లో...



ఓ మహిళా ఈ కవిత నీకే అంకితం



మహిళా.. ఓ మహిళ
అన్ని రంగాల్లో ఆకాశాన్ని అందుకుంటున్నావు.
అయినా నీకు తప్పట్లేదు కన్నీటి వ్యదలు..
తల్లిగా, భార్యగా, అక్కగా, చెల్లిగా, కూతురిగా ఎన్నో పాత్రల్లో గుర్తింపు
లేకున్నా ఎనలేని సేవ చేస్తూ ఒదిగిపోతున్నావు...
అయినా నిన్ను అర్థం చేసుకోలేని మూర్ఖులెందరో...
నీ ప్రేమ నీ, ఓపిక నీ, ఔన్నత్యానికి లేదు సాటి
నువ్వు తలచుకుంటే ఎందులోనూ లేరు నీకు పోటీ...
ఎన్ని వ్యదలున్న, ఎన్ని సమస్యలున్నా నీ కన్నీటిని రెప్ప చాటున
దాచుకుంటూ, బాధని పంటి బిగువున అణుచుకుంటూ ఎన్నేళ్లు నీకీ పోరాటం...
అన్నింటి కోసం, అందరి బాగుకోసం ఎందుకు నీకీ ఆరాటం...
మార్చుకోకు నీ వ్యక్తిత్వాన్ని దేనికోసం...
నీ చిరునవ్వే నీకు ఆభరణం
నీ ఉనికి, నీ అస్తిత్వానికి గుర్తింపులేని రోజు అంతరించిపోతుంది ఈ సృష్టి...
నీ ధైర్యం, నీ స్థైర్యం, నీ లక్ష్యం కుటుంబ సౌఖ్యం నీ ధ్యేయం...
ఏదేమైనా ఎవరు నిన్ను మరిచిన గాయపరిచిన ప్రకృతి నిన్ను మరవదు, మరవనీయదు...
సాగిపో నీలో నీవు
అవమానాలను, అవహేళనలను, అక్రమాలను అవకాశాలుగా మలుచుకో...
నీ ఔదార్యానికి నా ఈ కవిత అంకితం...
మహిళల అందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు...

సంగీత, ప్రిన్సిపాల్(తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం కాగజ్‌నగర్) సిర్పూర్(టి).

ఉద్యోగాల్లో పురుషులకు పోటీగా ఎదుగుతున్న మహిళలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో ఎన్నో రకాల వ్యక్తిత్వాలు గల వ్యక్తుల మధ్య తనకంటూ ఒక ప్రత్యేక స్థానం అహర్నిశలు తపిస్తూ ఒడిదుడుకులను తట్టుకుంటూ అనేక మంది మహిళలు ముందుకు సాగుతున్నారు తల్లిగా, చెల్లిగా, భార్యగా, కూతురుగా తన విధులు నిర్వహిస్తునే ఉద్యోగ జీవితంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్న ఎంతోమంది మహిళలు నేడు కనిపిస్తున్నారు. వారందరికీ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు చెబుతూనే వారి అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నమే ఈ ప్రత్యేకం.

మహిళలంటే చిన్నచూపు పోవాలి

శిరీష, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు



మహిళలంటే సమాజంలో ఉన్న చిన్నచూపు పోవాలి. ఇది తల్లిదండ్రుల వద్ద నుండి ప్రారంభం కావాలి. చిన్నప్పటి నుండి ఇంట్లో పిల్లలను ఒకే రకంగా పెంచడం జరిగితే మార్పు అక్కడే ప్రారంభమవుతుంది. ఎన్నో రకాల ఇబ్బందులు వస్తున్నప్పటికీ కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో వాటిని అధిగమిస్తూ వెళ్తున్నాను. చిన్ననాటి నుండి ఉద్యోగం చేయాలని ఆకాంక్షతో చదువుపై పట్టు సాధించాను. కుటుంబ సభ్యులు ఉద్యోగం చేయడానికి నాకు సహకారం ఇవ్వడంతో నా కల నెరవేరడానికి దోహద పడింది.

కష్టాన్ని మెట్టుగా చేసుకుని లక్ష్యాన్ని సాధించిన సోనీ



జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న దురిశెట్టి సోనీ కష్టాలను మెట్టుగా చేసుకుని లక్ష్యాన్ని సాధించింది. మహిళా దినోత్సవం సందర్భంగా అనుభవాలను పంచుకుంటూ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో పాటు ఊహ తెలిసిన తర్వాత తమ్ముడు కూడా చనిపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. అమ్మ ప్రతిరోజు కూలీకి వెళ్లి వచ్చిన డబ్బులతో చదువు పూర్తి చేశాను. దేవాపూర్‌లో పదవ తరగతి వరకు చదివి బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించి ట్రిబుల్ ఐటీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించాను. నేను అనుభవించిన పేదరికం నాకు ఎన్నో అనుభవాలను నేర్పింది. ప్రస్తుతానికి అనుకున్న స్థానాన్ని సాధించి సంతోషంగా ఉన్నాను. మిషన్ భగీరథ ఫీల్డ్ వర్క్ కావడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అటవీ రక్షణకు స్వప్న కృషి



ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో అటవీ బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న దైద స్వప్న అటవీ రక్షణలో ప్రత్యేక కృషి చేస్తోంది. ఈ సందర్భంగా తన అభిప్రాయం చెబుతూ అటవీ రక్షణ అనేది కత్తి మీద సాము లాంటిది. ఉన్నతాధికారులు సహకరించడంతో పాటు ప్రజల సహాయ సహకారాలు అందినప్పుడే అటవీ సంరక్షణ సాధ్యమవుతుంది. ఉన్నతాధికారులు ఇచ్చిన ప్రత్యేక అప్లికేషన్లతో ప్రతిరోజు అటవీ సంరక్షణలో భాగంగా అడవీలో తిరుగుతాం. దీనితో పాటు రాత్రిపూట నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఇతర ఉద్యోగాలతో పోల్చినట్లయితే అటవీ శాఖలో మహిళలకు కొంత ఇబ్బందిగానే ఉంటుంది. ఉన్నతాధికారుల సహకారం లేనిదే ఉద్యోగం చేయడం కష్టమవుతుంది. అటవీ శాఖలో మహిళ ఉద్యోగులకు కొంత వెసులుబాటు ఇస్తే బాగుంటుంది.

మహిళల సాధికారతకు కృషి

జీనత్, ఏపీఓ ఎన్ఆర్ఈజీఎస్, భీమారం

నవతెలంగాణ-తాండూర్



సామాజిక శాస్త్రంలో పీజీ చేసిన జీనత్ వెలుగు ఇందిరా క్రాంతి పథకంలో పనిచేసి మహిళల సాధికారతకు కృషి చేశారు. మహిళా సంఘాల అభ్యున్నతికి తోడ్పాటు అందించి మహిళా సంఘాలను పొదుపు పథంలో నడిచేందుకు తమ వంతు సహకారాన్ని అందించారు. మహిళల అభ్యున్నతికి కృషి చేసిన జీనత్‌కు 2000 సంవత్సరంలో ఉత్తమ మహిళా అవార్డు అందుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓగా లక్షెట్టిపేట, బెల్లంపల్లి, తాండూర్‌లో పనిచేసిన జీవత్ ప్రస్తుతం భీమారంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నైపుణ్యత లేని మహిళా కూలీలకు ఉపాధి కల్పిస్తు తోడ్పాటునందిస్తున్నారు. సామాజిక అంశాలపై మహిళల్లో చైతన్యం కల్పిస్తూ మహిళా సాధికారతకు కషి చేస్తున్నారు.

పట్టుదలతో ఉపాధ్యాయ ఉద్యోగం

• శ్రీలక్ష్మి టీచర్, కవయిత్రి

నవతెలంగాణ-తాండూర్



నలుగురు పిల్లలలో ఇద్దరు ఆడపిల్లలు, ఇంతకన్నా చదివించలేం, పెద్ద చదువులైతే ఇంకా ఎక్కువ చదివిన జోడు కోసం వెతకాలి, అందుకే పెళ్లి చేసేద్దాం అంటూ డిగ్రీ మధ్యలోనే పెళ్లి చేసి పంపిన మామూలు మధ్య తరగతి తల్లి దండ్రుల మొదటి సంతానం అడ్డగూరి శ్రీలక్ష్మీ. ఆమె కల నెరవేరేందుకు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం అటు భర్త, ఇటు తమ్ముడి సహకారం తీసుకుంటూ పట్టుదలతో స్నేహితుల నోట్స్ అడిగి చదువుకుంటూ ఇంట్లో నుండే డిగ్రీ పూర్తి చేశారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని 2002 డీఎస్సీలో తమ్ముడితో పాటూ టీచర్ ఉద్యోగం సాధించారు. వ్యక్తిగత, వృత్తి జీవితాన్ని సమన్వయము చేసుకుంటూ ఏ పాఠశాలలో పని చేసినా తనదైన శైలిలో వృత్తిలో రాణిస్తున్నారు. కవిత్వం రాయడం ఆమె అభిరుచి. పిల్లలకు దేశభక్తి గేయాలు, పాటలతో విభిన్నంగా భోధన చేస్తూ ఉంటారు. తాండూరు మండలంలోని యూపీఎస్ బోయపల్లిలో 10 ఏండ్లు ఉపాధ్యాయినిగా సేవలు అందించారు. రెబ్బెన మండలం నంభాల కాలనిలో పని చేసిన శ్రీలక్ష్మి ప్రస్తుతం ఎంపీపీఎస్ మాదారంలో పనిచేస్తున్నారు. రెండేళ్లలో పిల్లల సంఖ్యను 2 నుంచి 21కి పెంచి ఊరి ప్రజలు, పై అధికారుల అభిమానం చూర గొన్నారు. ప్రవత్తి అయిన రచనా వ్యాసంగంలో కూడా రాణిస్తూ.. అంతర్లీనలి వచన కవితా సంపుటి గత సంవత్సరం వెలువరించారు. విద్యార్థులకు ఊయోగపడేలా ఆమె రాసిన పాటలతో అంతస్మితం గేయ సంపుటి ఆవిష్కరణకి సిద్ధంగా ఉంది. తనకున్న అవకాశాలని సద్వినియోగం చేసుకుంటూ మహిళ సాధికారత దిశగా అడుగులు వేస్తు అందరి అభిమానాన్ని చూరగొంటున్నారు.

విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యం

• డీటీడీఓ రమాదేవి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తూ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ పురుషులతో సమానంగా తమతమ విభాగాల్లో పనితీరు కనబరుస్తు పనిచేసే మహిళలు అరుదుగా కనపడతారు. ఇదే సమయంలో ఎస్టీ, బీసీ, మైనారిటీ లాంటి మూడు శాఖలకు జిల్లా అధికారిణిగా వ్యవహరిస్తూ అన్ని శాఖలో పనితీరు మెరుగుపరిచేల చర్యలు తీసుకుంటున్న గిరిజన శాఖ ఉపసంచాలకులు రమాదేవి జిల్లాలోని మహిళలకు ఆదర్శప్రాయురాలు. మహిళా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడుతూ మహిళల అభివృద్ధి విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు తెచ్చినప్పటికీ వాటి అమలు తీరు కఠినంగా లేకపోవడంతో అక్కడక్కడ కొన్ని సంఘటనలు జరుగుతున్నాయని ఇది దురదృష్టకరమన్నారు. గతంతో పోలిస్తే మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, ఇది కొంత శుభ సూచకమన్నారు. మగవారితో పోలిస్తే మహిళలకు తెగువ ఎక్కువగా ఉంటుందని, ఓపిక, దేన్నైనా తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవడం సంతోషించేదగ్గ విషయమన్నారు. దీన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా గిరిజనులున్నారని విద్యకు వీరు దూరంగా ఉంటున్నారని, వారందరికీ విద్యా అవకాశాలు కల్పించేలా గ్రామస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళిక రూపొందించమన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులను సిద్ధం చేశామన్నారు. మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగిన నాడు సాధికారిక సాధ్యమవుతుందన్నారు. నేటికీ కొన్నిచోట్ల మహిళల పట్ల చిన్నచూపు ఉందన్నారు. మహిళా దినోత్సవాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని సూచించారు. జిల్లాలోని మహిళలకు మహిళల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సాఫ్ట్ వేర్ రంగం నుంచి సమాజ సేవలోకి..

వసంత పంచాయతీ సెక్రెటరీ, గోపాల్ నగర్

నవతెలంగాణ-తాండూర్



ఎంటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేస్తూ పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించి ప్రజా సేవకు అంకితమయ్యారు వసంత ప్రస్తుతం తాండూరు మండలం గోపాల్ నగర్ పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్న వసంత పంచాయితీ అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ జిల్లా స్థాయిలో పలు అవార్డులను అందుకున్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ పురస్కారాల్లో గోపాల్‌నగర్ పంచాయితీకి మూడవ స్థానం దక్కింది .ఈ సంవత్సరం జిల్లా ఉత్తమ పంచాయతీ సెక్రటరీగా వసంత కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మన ఊరు-మనబడి పథకంలో భాగంగా రాష్ట్రంలోనే మొదటిసారిగా అత్యున్నత సౌకర్యాలు గల పాఠశాల భవనానికి కృషిచేశారు. అంకితభావంతో పనిచేస్తూ పంచాయితీ అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ ప్రజలు అధికారులు నాయకుల మన్ననలు పొందుతున్నారు.

జయహో జనయిత్రి మహిళ

• నాగసుధ, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, సిర్పూర్(టి)

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం, సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలిగే నిరంతర జీవనాధార అవకాశాలు తామే స్వయంగా నిర్మించుకోగలిగే ఉన్నత స్థితికి చేరుకుని స్త్రీ శక్తి ఏంటో ప్రపంచానికి తెలియజెప్పుతూనే ఉన్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయం, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేయాలి. ఇప్పటికీ సమాజంలో మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. జెండర్ ఈక్వాలిటీ, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, లైంగిక దోపిడి, వరకట్నం వంటి సమస్యలను మహిళలు ఫేస్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతోమంది మహిళలు ప్రపంచవ్యాప్తంగా సమానత్వం కోసం తమ గొంతులను వినిపిస్తూనే ఉన్నారు. ఒక రంగంలో మహిళలు రాణించేందుకు, నాయకత్వంలో స్థానం సంపాదించుకునేందుకు ఎంతో కృషి చేయాల్సి వస్తుంది. మహిళలు చిన్న తనం నుంచే వివక్షకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్లలు పుట్టడమే శాపంగా భావిస్తున్నారు. అమ్మాయిలకు చదువు చెప్పించడమే దండగనే భావన కూడా ఉంది. ఈ పరిస్థితి మారాలి. అమ్మాయిలంతా చదువుకుని వారి స్వశక్తితో నిలబడాలి.

మహిళలు విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

• చునార్కర్ సువర్ణ, ఎంపీపీ, సిర్పూర్(టి)

నవతెలంగాణ-సిర్పూర్(టి)



అభ్యాసన సమయంలో బాలికలు ఉన్నత ఆలోచించి పురుషులు ఏ విధంగానైతే అన్ని రంగాలలో ఉన్నారో అలా మనము కూడా ఎన్ని ఇబ్బందులు వచ్చిన ఎదుర్కొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలి. నేటి మహిళలు కేవలం ప్రభుత్వ ఉద్యోగాల వైపే దృష్టి పెడుతున్నారు. అలా కాకుండా రాజకీయాల్లో పురుషులతో సమానంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను.

గిరిజనుల అభివృద్ధికి కృషి

- విద్యా, వైద్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ద్వారా ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నాం. విద్యా, వైద్యం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వారి దరికి చేరుస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి(పీఓ) ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలో అమలు చేస్తున్న పథకాలు, వారికి అందిస్తున్న సౌకర్యాలను వివరించారు.



పథకాలు సమర్థవంతంగా అమలు

ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించడంతో పాటు నాణ్యమైన వైద్యం లభించేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. వారి ఆరోగ్యంపై దృష్టిసారిస్తున్నాం. ఇటీవల ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకంలో భాగంగా పీవీటీజీ ప్రాంతాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. ఆధార్, కుల ధ్రువీకరణపత్రాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్ సౌకర్యం, టెలిఫోన్ సౌకర్యం, వంటగ్యాస్ తదితర 11 రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషిచేస్తున్నాం. ఇందుకు సంబంధించి నిధులు కూడా విడుదలయ్యాయి. మల్టిపర్పస్ భవనాన్ని కూడా నిర్మిస్తున్నాం. గిరివికాసం కింద లబ్దిదారులను ఎంపిక చేసి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బోర్లు వేయించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టిన కారణంగా బోర్లు వేసేందుకు కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బోర్లు వేయించే ప్రక్రియ చేపడుతున్నాం.

తాగునీటి సమస్య పరిష్కారం..!

ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. వేసవిలో తాగునీటి సమస్య నివారించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్నాం. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలి. మరోపక్క మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీలను సరిచేసేందుకు పంచాయతీల నిధులు కూడా వినియోగించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలల్లో రక్తహీనత బారినపడిన విద్యార్థులను గుర్తిస్తున్నాం. ఇందుకు విద్యార్థులందరికీ ఆరోగ్యకార్డులు అందిస్తున్నాం. పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది ఆయా పాఠశాలలకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వివరాలు అందులో నమోదు చేస్తారు. వీటి ద్వారా వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు ఆస్కారం ఉంటుంది.

ఆరోగ్యం, విద్య చాలా ముఖ్యం..!

మహిళలకు ఆరోగ్యం, విద్య చాలా ముఖ్యం. మహిళలు బలంగా ఉన్నప్పుడే కుటుంబం కూడా బాగుంటుంది. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. ప్రతి కుటుంబంలో మహిళలకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తే వారు ఆయా రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది.

రాజకీయాల్లోనూ రాణించాలని ఉంది

- ఆత్రం సుగుణ, కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ఇది వరకు పలు ఉద్యమాల్లో పనిచేశాను. జన్నారం మండలం మురిమడుగు ఎంపీటీసీగానూ సేవలందించాను. అనంతరం ఉపాధ్యాయ వృత్తి నిర్వర్తిస్తున్న తాను రాజకీయాల్లోనూ రాణించాలని ఉందని ఆత్రం సుగుణ అన్నారు. మనకోసం మనం బతకడం కాకుండా ఇతరుల కోసం బతకాలనే భావజాలంతో మేధావుల బాటలో పయనిస్తున్నానని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు.

రాజకీయాల్లో రాణించాలంటే కాంగ్రెస్ పార్టీ అయితేనే బాగుంటుందని విశ్వసించాను. కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. ఇప్పటికీ ఆదివాసీలకు సరైన విద్య వైద్యం లభించడం లేదు. చాలా చోట్ల రవాణా సౌకర్యంలేదు. ఉన్నత విద్యాలయాలు లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఎంపీగా విజయం సాధిస్తే ఇక్కడ కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తాను. మరోపక్క మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు. ఇందిరా గాంధీ దేశాన్ని పరిపాలించింది. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వాలు సైతం ఆయా అవకాశాలు కల్పించాలి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- వెడ్మ ద్రుపద, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సతీమణి

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలి. కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సతీమణి వెడ్మ ద్రుపద అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. ప్రస్తుతం విమానాలు నడిపే స్థాయికి ఎదిగారు. కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం సాధించలేనిదంటూ ఏదీ లేదు. ముందుగా ధైర్యం ఉండాలి. ముఖ్యంగా మహిళలు చదువుకోవడం చాలా ముఖ్యం. పేదరికం నుంచి బయటపడాలంటే చదువే ఆయుధం. ప్రతి ఒక్కరు చదువుకోవాలి.

ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ సరోజ, సూపరింటెండెంట్ దేవేందర్ రావు, ఎంపీఓ విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్, కార్యాలయ మహిళా సిబ్బందికి శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ ప్రకటనలో ఆరోపించారు. అధికారులకు మంచి బ్రాండెడ్ మందులను స్థానిక మెడికల్ షాపుల వారికి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పెషలిస్ట్ డాక్టర్లను చిన్న డిస్పెన్సరీలలో డ్యూటీ వేసి వారి విలువలను దిగజారుస్తున్నారని తెలిపారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

- మిల్కా జిల్లా ఉపాధి కల్పన అధికారి

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ప్రసవ మరణాలు పూర్తిగా ఆగిపోతాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని వీటి నిర్మూలనకు అందరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..ఇందుకు వ్యక్తిగత ఆసక్తి, తపన ఉండాలి. స్వయం సాధికారత సాధించే దిశగా అడుగులు వేయాలి. చట్టాలపై అవగాహన పెంచుకోవాలి.ఎక్కడ ఏముందో తెలుసుకోవాలి. ప్రస్తుతం మహిళలు అయా రంగాల్లో రాణిస్తున్నారు. కష్టపడితే సాధించలేనిది అంటూ ఉండదని నిరూపిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు చదువుకోవాలి. చదువుతోనే ఉజ్వల భవిత ఉంటుంది. ఆయా రంగాల్లో మరింత రాణించేందుకు ఆస్కారం ఉంటుంది.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి




భైంసా : నియోజకవర్గంలో విద్యా రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని అనసూయ పవర్‌నగర్‌లో రూ.61లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్సీకర్ శ్రీనివాస్ సేవలు అభినందనీయమన్నారు. 12 నుంచి 250 మందికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి 10 సంవత్సరాల పాటు శ్రమించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాస్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడిన కౌన్సిలర్ చందులాల్‌ను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడిన గత పాలకులను ఆయన అభినందించారు. అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలోఎంపీపీ అబ్దుల్ రజాక్, మండల విద్యాధికారి సుభాష్, నాయకులు సోలంకే భీంరావ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్, పట్టణ బిజెపి అధ్యక్షులు ఎనపోతుల మల్లేష్, నాయకులు దిలీప్, రావుల పోశెట్టి, వడ్నప్ శ్రీనివాస్, దత్తాత్రి, లింగురాం, పిఆర్‌టియు, ఎస్‌టియు సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.















పోరాట, సామాజిక స్ఫూర్తిని కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రాచీన కాలం నుంచి వివక్షను ఎదుర్కొంటున్న మహిళలు ఈ కాలంలో జీవితంలో పోరాట స్ఫూర్తిని జీవనంలో సామాజిక స్ఫూర్తిని కలిగి ఉండాలని ఉపాధ్యాయురాలు, మహిళా హక్కుల ఉద్యమకారిణి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం పట్టణంలో ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థినులు చదువు మీద దృష్టి పెట్టి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో మహిళల ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు సమాజంలో గౌరవప్రదంగా జీవించాలన్నారు. జీవితంలో అత్యున్నత స్థానానికి ఎదిగిన ఎందరో మహిళల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని, మహిళా అధ్యాపకులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త, ఫిజికల్ డైరెక్టర్ అనిత, అధ్యాపకులు జ్యోత్స్న, భువన, సలేహా, ఆఫ్రీన్, జాకీర్ హుస్సేన్, ప్రతాప్ సింగ్, రఘునాథ్, సంతోష్ కుమార్, రమేశ్, నర్సింగరావు, దయాకర్ విద్యార్థినులు పాల్గొన్నారు.





మహిళలను గౌరవించే బాధ్యత అందరిది



నవతెలంగాణ-తాంసి

మహిళలను గౌరవించే బాధ్యత మన అందరిదని ఎంపిడిఓ గంగారెడి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్, ఎంపీపీతో పాటు ఎంపీటీసీలు, కార్యాలయ మహిళా సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూల కారణమైన మహిళా సోదరీమణులను గౌరవించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మహిళ భార్యగా, తల్లిగా, తోబుట్టుగా ఉంటూ కుటుంబ బాధ్యతల్లో ముఖ్య బాధ్యత పోషిస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. మహిళను చిన్నచూపు చూడకుండా వారి పట్ల గౌరవంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీఓ స్వప్నశీలా, ఎంపీపీ సురుకుంటి మంజుల, ఏపిఓ విజయ, ఎంపీటీసీలు రేఖ, భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో నేటి మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు జాతర నిరహించనున్నారు. ప్రధానంగా శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం కావడంతో జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గురువారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్ ఏర్పాట్లు చేశారు. జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించి ఈఓకు పలు సూచనలు చేశారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ వెంట నాయకులు వనమాల రాము, సంజయ్‌సింగ్ ఉన్నారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలను వేద పండితులు ముద్దు నరహరి శర్మ, ఆలయ అర్చకులు ఇందారపు సంతోష్ శర్మల నిర్వహించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-తలమడుగు

మండల ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేయాలంటూ సామాజిక కార్యకర్త గొంటిముక్కుల ప్రేమేందర్ గురువారం మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. 2005లో అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టం వివరాలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. రాజ్యాంగ బద్ధమైన సమాచార హక్కు చట్టాన్ని గౌరవించడం అందరి కర్తవ్యమన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా మండల స్థాయి అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఇప్పపువ్వు లడ్డూ తయారిలో ..

మహిళ స్వయం సహాయక సంఘం

• లడ్డూలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు







నవతెలంగాణ-ఉట్నూర్

ఇప్పపువ్వు లడ్డు తయారిలో ఆదివాసీ మహిళ స్వయం సహాయక సంఘం గుర్తింపును పొందింది. ఆదివాసీ ఆహారాన్ని 2019 మేలో ప్రారంభించామని ఆదివాసీ స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు కుంరం బాగుబాయి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కోశాధికారిగా, ఐకేపీ వీఓ అధ్యక్షురాలుగా 13 సంవత్సరాలుగా పనిచేశానని పేర్కొన్నారు. ఐకేపీలో 10 మందితో ఒక గ్రూప్‌ను తయారు చేశానని, అలా 14 సంఘాలను ఏర్పాటు చేశానని అన్నారు. అప్పుడు తమ సంఘానికి గుర్తింపు వచ్చింది. ఐకేపీ ఆధ్వర్యంలో తమకు పావల వడ్డీతో రుణం ఇచ్చారు. తమకు ఐటీడీఏ ఆధ్వర్యంలో యావత్మాలోని జల్కలో శిక్షణ ఇచ్చారు. శిక్షణపూర్తయిన తర్వాత, ఉట్నూరు మండలంలోని కేబి కాంప్లెక్స్ వికాసం పాఠశాలలో కొన్ని రోజుల పాటు ఇప్పపువ్వు లడ్డూలను తయారు చేశాం. అనంతరం లింగోజి తండా గ్రామ పంచాయతీలోని ఎక్స్‌రోడ్‌లో ఒక గదిని కేటాయించారు. అక్కడ ఆదివాసీ ఆహారం అనే పేరుతో ఒక కార్యాలయాన్ని ప్రారంభించాం. ఆదివాసీ మహిళా 12 మందితో ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేసి శిక్షణ తీసుకున్నామని అన్నారు. మండలంలోని మత్తడిగూడ, ఫకీర్‌గుట్ట గ్రామానికి చెందినవారే ఆదివాసీ మహిళలు సభ్యులుగా ఉన్నారు.

లడ్డు తయారిలో...

అడవి నుంచి సేకరించిన ఇప్పపువ్వుతో అనేక రకాల ఆహార పదార్థాలను తయారు చేస్తాం అందులో పల్లీలు, నువ్వులు, కాజు, నెయ్యి, యలకులపొడి, బెల్లంతో ఇప్పపువ్వు లడ్డును తయారు చేస్తాం. ఇప్ప పువ్వులతో జ్యూస్, చాయ్ కూడా తయారు చేస్తాం. అదేవిధంగా ఇప్పపువ్వుతో ఏడు రకాలుగా ఆహారాన్ని తయారు చేస్తున్నాం అదేవిధంగా ఇప్పగురే, గారే, లడ్డు, చాట్ మసాలా, తీపి, చాయ్, జ్యూస్ తయారు చేస్తున్నాం. ఈ లడ్డులు గర్భవతులకు, బాలింతలకు రక్త హినతతో బాధపడుతున్న మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఆ లడ్డు రూ. 4వందలకు కిలో అమ్ముతున్నాం. మహిళలు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతుంటారు. అలాంటి వాళ్ల ఈ ఇప్ప పువ్వు లడ్డూలను కనీసం మూడు నెలలు తింటే తప్పకుండా రక్తం పెరుగుతుందని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నాగపూర్, లాంటి నగరాలలో కూడా లడ్డూలను చాలా ఇష్టపడుతున్నారని అన్నారు. కేస్లాపూర్ నాగోబా జాతరలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిని రుచి చూశారని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

• నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వారు నిర్భయంగా ఉండేందుకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. ప్రస్తుత కాలంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో మహిళలు ఎన్నో రంగాల్లో రాణిస్తున్నారని, వారినీ ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. శాఖ పరంగా మహిళ రక్షణ, భద్రత పరంగా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. షీటీం ద్వారా మహిళలకు భరోసాను కల్పిస్తున్నామన్నారు. మహిళల పట్ల ఎక్కడైనా అసభ్యకరంగా కానీ, వేధింపులుగాని జరిగితే సమాచారం తెలియగానే తక్షణమే షీటీం వాళ్లు అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తున్నారు ప్రతి మహిళ నిర్భయంగా తాము ఎంచుకున్న లక్ష్యాన్ని ఎన్ని అవరోధాలు వచ్చినా సాధించాలి. వివిధ రంగాలలో కాకుండా పోలీస్ శాఖ రంగంలో సైతం ఎందరో మహిళలు ఉన్నత స్థాయిలో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ఏదైనా సమస్య తలెత్తితే 100 డయల్‌కు లేదా సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. మహిళల రక్షణ భద్రత కోసం కళాశాలలో పలు సంస్థలలో అవగాహన సదస్సులు చేపడుతున్నాము. మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించిన, వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరకట్నం పూర్తిగా నిషేధించాలి

• ఎంపీటీసీ గిత్తే ఆశాబాయి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



నేటి సమాజంలో మహిళలకు పెరుగుతున్న వరకట్న పిశాచిని పూర్తిగా నిషేధించాలని ఇంద్రవెల్లి ఎంపీటీసీ గిత్తే ఆశాబాయి తన మనోభావాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మహిళల కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చిన అవి అమలు కాక కాగితాలకే పరిమితమవుతున్నాయని అన్నారు. మన సమాజంలో నాటుకు పోయిన వరకట్నం అనే పిశాచి ఆరికట్టినప్పుడే, మహిళలకు నిజమైన స్వాతంత్ర్యం పొందినట్లుగా తాను భావిస్తున్నాను. ఇన్ని చట్టాలు ఉన్న దేశంలోని ఏదోక ప్రాంతంలో ప్రతి రోజు అఘాయిత్యాలు, హత్యలు, వరకట్నపు మరణాలు సంభవిస్తునే ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఉన్నత చదువులు చదుకున్నావారు, అగ్రవర్ణాలలోని కొన్ని కులాలు వరకట్నం కోసం వదూవులను హింసిస్తున్నారని అన్నారు. మహిళ ఎంత ఉన్నత చదువులు చదివిన అంతే మొత్తంలో వరకట్న వేధింపులకు గురవుతున్నారని అన్నారు. దీనిపై ప్రభుత్వాలు మరిన్ని కఠిన చట్టాలు తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశానికే అహింస మార్గంలో స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ భారత దేశంలో మహిళ అర్ధరాత్రి స్వతంత్రంగా తిరిగి నప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం లభించినట్టు అని తెలిపారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో మిట్ట మధ్యాహ్నంమే మానవ మృగాల అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్‌లో జరిగిన దిశా సంఘటన, ఇటీవలే మన జిల్లాలోని ఖానాపూర్‌లో జరిగిన స్నేహా బలవంతపు ప్రేమ పేరిట హత్యలు. దీనిపై సమాజంలో మార్పు రావాలి. ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేసి, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఉక్కుపాదం మోపాలి.

విద్యతోనే మహిళలకు స్వశక్తి

• ఎంఈఓ జయశీల

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



విద్యతోనే మహిళలకు స్వశక్తి అని ఎంఈఓ జయశీల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నవతెలంగాణలో మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు స్వశక్తితో ఉంటేనే ధైర్యంగా ఉంటారు. మానసికంగా ధృఢంగా ఉంటారు. మహిళలు ఏ రంగంలోనైనా రాణించాలంటే ముఖ్యంగా విద్య నేర్చుకోవడం చాలా ముఖ్యం. మహిళా విద్యావంతురాలైతే కుటుంబం, సమాజం అభివృద్ధి పథంలో ఉంటుంది.

మహిళలకు సెలవు ఇవ్వడం గర్వకారణం

నవతెలంగాణ-ఉట్నూర్

మార్చ్ 8న ప్రత్యేకంగా మహిళలకు సెలవు ఇవ్వడం గర్వకారణంగా ఉందని సీడీపీఓ జి.శ్రావణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె నవతెంగాణతో మాట్లాడారు. 2015 బీఎస్సీ హోం సైన్స్‌లో కోర్సులు పూర్తి చేసుకున్నాను. 2018 సెప్టెంబర్‌లో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలానికి సీడీపీఓగా ఎంపిక అయ్యాను. మొదటి అపాయింట్‌మెంట్ ఏజెన్సీ ప్రాంతంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉన్న 252 అంగన్‌వాడీ కేంద్రాలకు సీడీపీఓగా ఉద్యోగం చేయడం నా అదృష్టమేనని అన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఉద్యోగం చేయడం కష్టంతో కూడుకున్నదని అన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైన విధి నిర్వాహణలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాధించుకున్నానని అన్నారు.



ఓ మహిళా నీకు శతకోటి వందనాలు

● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సృష్టికి మూలం స్త్రీ. ఆమె శక్తి యుక్తులు అపారం. ఆమె ఓ ప్రేరణ.. ఓ లాలన. ఆమె లేకుంటే ఈ సృష్టి లేదు. దానికి గమ్యం, గమనం లేదు. మనిషికి జీవం, జీవితమే లేదు. ఆమె లేకుంటే అంతా శూన్యం. అందుకే ఆమెకు శతకోటి వందనాలు. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ చరిత్ర సృష్టిస్తున్నారు. అవకాశాలు రాకపోయినా, అవమానాలు ఎదురైనా.. ఎవరో వచ్చి సాయం చేస్తారని ఎదురుచూడటం లేదు. ఆకాశం, అవకాశాల్లో సగంగా అంటూ ముందంజలో దూసుకుపోతున్న స్త్రీమూర్తులెందరో. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవతెలంగాణ అందించిన కొన్ని ప్రత్యేక కథనాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒత్తిడిని జాయిస్తూ.. ఉద్యోగం కొనసాగిస్తూ...

తలమడుగు ఎస్ఐ కుబీర్ ధనశ్రీ



వర్కింగ్ ఉమెన్ కావాలనుకున్న ఆమె నేడు పోలీస్ రంగంలో కొలువు సాధించి ప్రజలకు సేవ చేస్తుంది. బైంసా పట్టణానికి చెందిన కుభీర్ ధనశ్రీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి అన్ని పరీక్షలను రాస్తూ తన వంతుగా తీవ్రంగా ప్రయత్నించింది. ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగానికి ప్రయత్నించిన క్రమంలో ఏకంగా మొదటి ప్రయత్నంలోనే 2019 సంవత్సరంలో పోలీస్ ఎస్ఐగా జాబ్ కొట్టేసింది. వచ్చిన జాబ్ వదులుకోవడం ఎందుకని ఆ జాబ్‌లో జాయిన్ అయ్యారు. కానీ ఆ జాబ్ కుటుంబ సభ్యులు వద్దన్నారు. వారికి నచ్చజెప్పి వారి ప్రోత్సాహంతో నేడు ఉద్యోగంలో రాణిస్తూ తన విధులను కొనసాగిస్తోంది. రోజుకో కేసులో వివిధ రకాల ఒత్తిడిని జయిస్తూ ప్రజలకు సేవలందిస్తూ ముందుకు సాగుతున్నారు. మొదటగా తాంసి మండల పోలీస్ స్టేషన్ లో పోస్టింగ్ వచ్చింది. ప్రస్తుతం తలమడుగు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గా విధులు నిర్వర్తిస్తున్నారు. మహిళలు తమకు నచ్చిన ఏ రంగంలో అయిన తమ ప్రతిభను చాటి స్వతహాగా ఎదిగి ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

విద్యరంగంలో రాణిస్తూ.. ఉన్నతంగా ఎదిగారు

పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ లెక్చరర్ పాలాస స్వాతి



విద్యార్థులను క్రమశిక్షణతో చదివించి వారిని ఉన్నత స్థానాల్లో చూడటమే ఆమె లక్ష్యంగా భావించి, ఇష్టంగా విద్యరంగంలో రాణిస్తున్నారు. సీనియర్ లెక్చరర్ స్వాతి ప్రస్తుతం నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ బ్రాంచ్ విద్యార్థులకు విద్యానందిస్తున్నారు. చిన్నప్పటి నుంచి విద్యారంగంలో రాణిస్తూ ఉన్నతంగా అంచెలంచెలుగా ఎదిగి వరుసగా మూడు ప్రభుత్వ కొలువులు సాధించారు. ట్రాన్స్‌కో, జెన్కో, పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. తనదైన శైలిలో విద్యార్థులను మోటివేట్ చేస్తూ వారిని క్రమశిక్షణలో ఉంచుతూ, చాలా మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టి పలువురి మన్ననలు సైతం పొందుతున్నారు. నిత్యజీవితంలో విద్య చాలా అవసరమని ప్రతి మహిళ విద్యాభ్యాసాన్ని అభ్యసించి, విద్యారంగంలో రాణించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆత్మరక్షణ కోసం.. కరాటేలో రాణించింది

బ్లాక్ బెల్ట్ పవర్ సంధ్య



నేటి సమాజంలో బాలికలకు వేధింపులు ఎక్కువయ్యాయి. ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయం. ఆకతాయిలు, పోకిరీల ఆగడాలు, వేధింపులు, అత్యాచారాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి బాలికలకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరం. ఇందులో భాగంగానే తాను చిన్నప్పటి నుంచి కరాటే రంగాన్ని ఎంచుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పవర్ సంధ్యా చిన్నప్పటి నుంచి కరాటే నేర్చుకుంటూ కరాటేలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో మెడల్స్, రకరకాల బెల్ట్‌లు అందుకున్నారు. మహిళలు ప్రస్తుతం బయట తిరగాలంటే ఆత్మరక్షణ ఎంతో అవసరమని ఆమె సూచించారు.

సృష్టికి మూలం మహిళలే

● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సృష్టికి మూలం అమ్మ.. మహిళ లేనిదే ఈ ప్రపంచం లేదు. లోకంలో ఎన్నో బంధాలు, అనుబంధాలకు ప్రతిరూపం మహిళ. తల్లిగా, చెల్లిగా, కూతురిగా, భార్యగా ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తోంది. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశాభివృద్ధి శరవేగంగా సాగుతుంది. నేటి తరం అతివలు ఈ దిశగా ముందుకు దూసుకెళుతూ సత్తా చాటుతున్నారు. ప్రతిభతో ఉజ్వల భవితకు బాటలు వేసుకుంటున్నారు. అతివల భాగస్వామ్యం అన్నింటా మరింతగా పెరగాలి. వారికి పూర్తిస్థాయిలో సమాన అవకాశాలు కల్పించాలి. ఇది ఇంటి నుంచే ప్రారంభం కావాలి.

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రోత్సాహలతో నచ్చిన పని చేస్తూ రాణిస్తుంది

గైనకలాజిస్ట్ మదురు విజయలక్ష్మీ



చిన్నప్పటి నుంచి ఇంట్లో వాళ్ల ప్రోత్సాహంతో, వివాహం అయ్యాక భర్త ప్రోత్సాహంతో ఇష్టాంగా భావించే వైద్యరంగంలో కొనసాగుతూ వైద్య సేవలు అందిస్తుంది ఆ మహిళ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన విజయలక్ష్మీ వైద్యరంగంలోనే వృత్తి చేయాలంటూ కలగా పెట్టుకున్నారు. అందులోనూ గైనకలాజిస్ట్‌లో సేవాలందించడం మరింత ఇష్టాంగ భావిస్తున్నారు. కాగా ప్రేమవివాహం చేసుకొని ఆదిలాబాద్‌లో స్థిర పడగ వేలల్లో డెలివరీలు చేస్తూ తనకు నచ్చిన వైద్యరంగంలో తనకిష్టమైన వృత్తిని చేస్తూ రాణిస్తున్నారు. నేటి మహిళలు పురుషులకు సమానంగా పనిచేయాలని అన్నింటిలో రాణించాలని పేర్కొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జలగం అనిత



పోటీ పరీక్షలో ఇతర ఉద్యోగాలు వచ్చినప్పటికీ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చేదిద్దే అవకాశం ఒక టీచర్‌కు మాత్రమే ఉందని విద్యరంగం ఎంచుకొని, విద్యారంగంలో ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన డా.జలగం అనిత విద్యార్థులకు టీచింగ్ చేయాలన్న పనిని తాను ఎంతో ఇష్టంగా చేస్తూ కొనసాగిస్తున్నారు. విద్యార్థిని స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి కొలువు సాధించి ప్రస్తుతం ఆదిలాబాద్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థినులందరు క్రమశిక్షణతో చదివి ఉద్యోగంలో జీవితంలో రాణించాలి. తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని ఆకాంక్షించారు.

సమస్యలు పరిష్కరించి.. ఆనందం పొందుతూ...



సఖి కేంద్రం నిర్వహకురాలు గోపాల సరస్వతి

ఇంటా, బయట వేధింపులు. లైంగిక దాడులు, ఇతర సామాజిక సమస్యలతో బాధపడే మహిళలకు జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం అండగా నిలుస్తున్నది. ఈ సఖి కేంద్రంలో విధులు నిర్వర్తించడం తనకెంతో ఇష్టాంగ భావిస్తున్నట్లు సఖి కేంద్రం నిర్వహకురాలు గోపాల సరస్వతి తెలిపారు. గుడిహత్నూర్ మండలానికి చెందిన ఆమె 2019లో సఖిలో ఉద్యోగం సాధించింది. చిన్న, చిన్న మనస్పర్ధలతో భార్యాభర్తల మధ్య గొడవలకు దారితీస్తుంది. అలాంటి సమయంలో తమ కేంద్రానికి వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇస్తుంది. అనంతరం వారు కలిసిమెలిసి ఉండటంతో తమకు ఆనందం కలిగిస్తుందని చెబుతున్నారు. ఇప్పటి వరకు ఎన్నో వివిధ రకాల కేసులను తనదైన శైలిలో పరిష్కరించారు. మహిళల సంరక్షణ ధ్యేయంగా విధులు నిర్వర్తించడం, ఈ ఉద్యోగంలో ఎంతో సంతృప్తికరంగా ఉన్నట్లు ఆమె చెబుతుంది.

చదువులో కష్టపడితేనే ఉద్యోగం సాధించవచ్చు

నవతెలంగాణ-బోథ్



ఉన్నత చదువులను చదివి, కష్టపడితేనే ఉద్యోగం సాధించవచ్చని కేజీబీవీ ఎస్ఓ వలిత అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. ఎన్నో వ్యయా ప్రయాసాలలో బడి అనేక ఒడిదుడుకులతో అమ్మ నాన్నలు డిగ్రీ దాకా చదివించారు. అలాగే భర్త సాయంతో బీఎడ్ ఇంగ్లీష్ మీడియం చదివి ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉన్నత పాఠశాలలోని సీఆర్టీ, ఎస్ఏ ఇంగ్లీషులో ఉద్యోగం పొందాను. అలాగే అంకితభావంతో ఎనిమిది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాను. 2018లో ఎస్ఎస్ఏ నోటిఫికేషన్ రావడంతో నా భర్త ప్రోత్సాహంతో పోటీ పరీక్షలు రాసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 5వ ర్యాంకు సాధించి, కేజీబీవీ పాఠశాలకు ఎస్ఓగా ఉద్యోగం సాధించి, విధులు నిర్వర్తిస్తున్నాను. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు కష్టపడి చదివి, ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు.

చదివే మహిళలకు జీవితం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



చదికునే మహిళలు జీవితంలో ఉన్నతంగా ఆదిలాబాద్ ఆశ్రమోన్నత బాలికల పాఠశాల హెచ్‌డబ్లూఓ కే.మౌనిక ఉంటారని అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో మాట్లాడారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే మహిళలు చదువుకోవాలని అన్నారు. ఆడపిల్లలు చదువుకుంటే అన్ని రంగాల్లో రాణించగలుగుతారు.

మహిళ విద్యావంతురాలు కావాలి

● ఆదిలాబాద్ మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మహిళ విద్యావంతురాలు అయితే కుటుంబం ఉన్నతంగా ఉంటుందని ఆదిలాబాద్ మాజీ ఎంపీపీ మంచి కట్ల ఆశమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలు చదువులో రాణించి, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ప్రతి అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ప్రతి మహిళ తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకోవాలి. ప్రతి ఆడపిల్ల ఉన్నత చదువులు చదివితేనే సమాజంలో మంచి గౌరవం ఉంటుంది. మధ్యలోనే ఆపేయకుండా ఉన్నత చదువులు చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. విద్యతోనే జీవితంలో ఏదైనా సాధించవచ్చని విషయం మహిళలు గ్రహించాలి. మహిళలు రాజకీయాల్లో రాణించాలంటే కుటుంబ సభ్యుల ప్రోత్సాహం సహకారం ఎంతో అవసరం.

స్ఫూర్తి దాతలు మహిళలు

నవతెలంగాణ-ఉట్నూర్



అందరికీ స్ఫూర్తి దాతలు మహిళలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉట్నూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు మహిళా ఉద్యోగులను, పంచాయతీ కార్యదర్శులను శాలువాలతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నేటి మహిళ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బందిలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-సిరికొండ



మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ యాస్మిన్‌ను మహిళ దినోత్సవం సందర్భంగా సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న రిజర్వేషన్లను మహిళలు సద్వినియోగం చేసుకున్నప్పుడే గుర్తింపు లభిస్తుందని అన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, రెవెన్యూ ఇన్స్‌క్టర్ విలాస్, సిబ్బంది రాజేశ్వర్, అమూల్, నాగోరావ్ పాల్గొన్నారు.

స్త్రీలను గౌరవించే సంస్కృతి మనది

● జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్



స్త్రీలను గౌరవించి, పూజించే సంస్కృతి మనదని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లాలోని మహిళా అధికారులకు, సిబ్బంది మార్చి 8న సెలవు ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పని చేస్తున్న మహిళా అధికారులందరిని జిల్లాలోని బరోసా సెంటర్‌కి ఆహ్వానించారు. అనేక రంగాల్లో మహిళలు తిరుగులేని నాయకత్వాన్ని పోషిస్తున్నారని అన్నారు. మహిళలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. సమాజంలో ప్రతి మహిళా అన్ని రంగాల్లో సమానత్వం సాధించాలని అకాంక్షించారు. జిల్లా పోలీస్ విభాగంలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన మహిళా అధికారులకు బహుమతులు ఇచ్చి వారిని ప్రోత్సహించారు. జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న మహిళా పోలీస్ అధికారిణులు దాదాపు 100 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజర్షిషాను యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా ప్రజా సంక్షేమం కోసం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ నాయకులకు సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచులు ఆడే శంకర్, భారత్, మోహన్, దీపక్, సతీష్‌రెడ్డి ఉన్నారు.

నవతెలంగాణ

1

ఆదిలాబాద్

శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

ముగ్గుల పోటీల నిర్వహణ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా డీఆర్డీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ప్రారంభించారు. అనంతరం మహిళ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మరమేష్, జెడ్పీటీసీ ఒసా రాజేశ్వర్, తహసీల్దార్ జానకి, ఎంపీడీఓ రాంప్రసాద్, ఏపీఎం వాణిశ్రీ, ఏపీఓ ప్రమీల, సీసీలు, అంగన్వాడి సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నాగోబాను దర్శించుకున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజర్షి షా గురువారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. గ్రామ పటేల్ వెంకట్‌రావ్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. నాగోబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జీవాకర్‌రెడ్డి, ఎంపిడిఓ భాస్కర్ బోకేను అందజేసి స్వాగతం పలికారు. నాగోబా నూతన మందిర నిర్మాణం, ఆలయ చరిత్ర గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐటిడిఏ ఈఈ రాథోడ్ భీమ్‌రావ్, ఏఇ సతీష్ ఉన్నారు.



ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి మైదానం సిఇఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రతిజ్ఞతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. సేవాధ్యక్షురాలు రాధా కుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శ్రీరాంపూర్ యాజమాన్యం అత్యంత ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. మహిళల్లో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండని 2024 సంవత్సర మహిళా దినోత్సవ థీం అని పేర్కొన్నారు. ఈ రోజుల్లో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు అనేక రంగాలలో వివిధ సంస్థలలో అధిపతులుగా ఉండటం చెప్పుకోదగిన విషయమని గుర్తు చేశారు. మహిళలు వివిధ కంపెనీలలో పని చేస్తూ వారి వృత్తిని, కుటుంబ బాధ్యతలను దిగ్విజయంగా పూర్తి చేయడం గొప్ప విషయమన్నారు. సింగరేణి సేవా సమితి ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ వృత్తి శిక్షణ కోర్సులను పరిసర ప్రాంత మహిళలు నేర్చుకొని తమ కాళ్లపై తాము నిలబడడానికి చేస్తున్న ప్రయత్నం అనిర్వచనీయమన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెట్టి ఏ రంగంలోనైనా ముందుండడానికి కృషి చేస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం వి.పురుషోత్తమరెడ్డి, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, డిజిఎం పర్సనల్ పి అరవింద రావు, సీనియర్ పిఓ పి కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి, శారద, తిరుమల, రజిత, మంగ, సునీత, భారతి, మమత పాల్గొన్నారు.

క్రికెట్‌లో విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో జరుగుతున్న కాకా వెంకటస్వామి స్మారక పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందిన టీమ్స్‌కు గురువారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, వివేక్ వెంకటస్వామి తనయుడు వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరై గెలుపొందిన టీమ్స్‌కు బహుమతులు, ప్రైజ్ మనీ అందజేశారు. అనంతరం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సెప్టెంబర్ తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాకా స్మారక క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రికెట్ క్రీడాకారులను నేషనల్ లెవెల్‌లో క్రికెట్ ఆడించేందుకే కాకా ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవకు మించిన సంతృప్తి లేదు



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మేడిగూడ కెనాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పొద్దుటూరి లక్ష్మారెడ్డి సహకారంతో రూ.20వేల విలువైన ఏడు సిమెంట్ బెంచీలను బస్టాప్, పాఠశాల, గ్రామ కూడలిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మేడిగూడ కెనాల్ దగ్గర గల బస్ స్టాప్ శిథిలావస్థలో ఉండటంతో బస్సు కోసం ఎదురు చూసే మహిళలు, పిల్లల ఇబ్బందులు గమనించి దానికి మరమ్మత్తు చేసి, ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీలను ఏర్పాటు చేశానని తెలిపారు. గతంలో కూడా సాత్నాల రోడ్‌కు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించే ఏర్పాటు చేశానని అన్నారు. సమాజానికి సేవ చేయడంలో సంతృప్తి ఉందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడిగూడ కెనాల్ మాజీ ఉప సర్పంచ్ తూడం పొచ్చన్న, భవానీ ఆనంద్, పెంటపర్తి ఊశన్న పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని రెబ్బనపల్లి గ్రామంలో కటకం శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రామగుండం టాస్క్ ఫోర్స్ సిబ్బంది దండేపల్లి పోలీసులతో కలిసి పట్టుకున్నారు. ముందస్తు నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు వారు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాడులు ముమ్మరం చేశామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన శిక్షార్హులు అవుతారని తెలిపారు. ఈ దాడిలో దండేపల్లి ఇన్‌చార్జ్ ఎస్ఐ పాల్, రామగుండం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వేలాలలో మొదలైన జన జాతర

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- 2 నుండి 3 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం
- నేటి నుండి మూడు రోజుల పాటు కొనసాగనున్న జాతర



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలాల మల్లన్నను దర్శించుకునేందుకు భక్తుల రాకపోక మొదలైంది. లక్షల్లో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లపై దేవాదాయ శాఖ దృష్టి సారించింది. శుక్రవారం గుట్టపై వెలిసిన మల్లన్న సన్నిధిలో జాతర కొనసాగనుండగా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు చలువ నీడలు ఏర్పాటు చేస్తున్నారు. శని, ఆదివారాల్లో వేలాల గ్రామంలో గల మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో జాతర జరుగుతుంది. సుమారుగా 2 నుండి మూడు లక్షల మంది భక్తులు మల్లన్న దర్శనార్థం తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వేలాల బస్టాండ్ సమీపంలో గల కమాన్ నుండి గుట్ట దిగువన గల రోడ్డు పరిసరాలను చదును చేయించడంతో పాటు అవసరమైన ప్రదేశాల్లో మట్టితో రోడ్డును విస్తరిస్తున్నారు. అదేవిధంగా గుట్ట పైకి భక్తులు తరలి వెళ్లడం కోసం రహదారి ఏర్పాట్లు, నీటి వసతి, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని ఈఓ రమేశ్ తెలిపారు. అదేవిధంగా గ్రామంలో గల ఆలయం ఆవరణలో క్యూలైన్లు, షామియానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదావరి నది ఒడ్డున స్నానఘట్టాల వద్ద పైపుల ద్వారా స్నానాలకు ఏర్పాట్లు చేశారు.



అధికారుల ఆదేశాల మేరకు బందోబస్తు ఏర్పాట్లు : శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్

వేలాల మల్లన్న జాతరకు సంబంధించి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్లు శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్ తెలిపారు. వేలాల జాతర ఏర్పాట్ల దృష్టితో రెండు రోజుల నుండి వేలాల గ్రామంలో పోలీస్ అధికారులతో మకాం వేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జన సందోహం, రద్దీ ప్రదేశాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర సహాయ కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన తెలిపారు. ముందుగా సిఐటియు కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో గర్భిణులకు రక్త పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు, నెలకు సరిపడా మందులను ఇవ్వడం జరిగిందన్నారు. కానీ 104 వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆ వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులను తాత్కాలికంగా సర్దుబాటు చేసి నేటికీ 22 నెలలు గడుస్తున్నా ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. 104 ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరి చేయించుకుంటోందని తెలిపారు. 104 ఉద్యోగులకు బేసిక్‌పే వర్తింపజేయలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా ట్రెజరీ నుండి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమెల్ల కిరణ్, 104 ఉద్యోగులు ఆనంద్, సురేందర్, నాగానాథ్, సుభాష్, ఇబ్రహీం, వెంకన్న, ప్రశాంత్, సంధ్య పద్మ, శ్రీకాంత్, అశోక్‌రెడ్డి, పురుషోత్తం, వామన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా క్రీడాపోటీల్లో పథకాలు సాధించిన జిల్లాకు చెందిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలలో రాణించాలన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఇటీవల జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో 7వ ర్యాంకు సాధించిన ఎస్.మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తమిళనాడులో ఫిబ్రవరి 18 నుండి 21 వరకు జరిగిన ఖేలో ఇండియా సౌత్ జోన్ పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో పథకాలు సాధించిన జె.నిర్విజ్ఞ, బి.స్వేచ్ఛారెడ్డి, జె.కావేరి, డి.నిఖిత, ఆర్.స్వాతిని పథకాలు, ప్రశంశా పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 26 నుండి జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో జరగనున్న సబ్ జూనియర్ క్రీడా పోటీల్లో భైంసా మండలం పాంగ్రి గ్రామానికి చెందిన విద్యార్థి రామ్ చరణ్ పాల్గొననున్నారని తెలిపారు. వ్యాయమ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌ను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఇన్చార్జి డీవైఎస్‌వో నఫేఖాన్, వ్యాయమ ఉపాధ్యాయులు సాయికృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మాధవరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్

సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సభను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడారు. దేశంలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలన్నారు. బిజెపి కార్పొరేటు, మతోన్మాద విధానాలను ప్రతిఘటిద్దామని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, పిల్లలపై లైంగిక హింస పెరిగిందని, సమాన పనికి సమాన వేతనం కావాలని డిమాండ్ చేశారు. బిజెపి 2014లో అధికారంలోకి వచ్చాక మహిళలపై అనేక అత్యాచారాలు, హింస పెరిగిందన్నారు. గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం హయాంలో బిల్‌కిస్ భానుపై లైంగికదాడి చేసిన వారిని కోర్టు శిక్షిస్తే అక్కడి ప్రభుత్వం వారిని సత్ప్రవర్తన కలిగిన ఖైదీలుగా గుర్తించి వారికి జైలు నుండి విడుదల చేసిందని గుర్తు చేశారు. జైలు నుండి విడుదల చేసి వారికి పూలదండలు వేసి శాలువాలు కప్పి ఊరేగింపు చేశారని మండిపడ్డారు. మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులు అనేకం జరిగాయన్నారు. దీనికి సంబంధించిన బిజెపి పార్లమెంటు సభ్యులు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌కు బీజేపీ కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలిచిందని మండిపడ్డారు. హత్రాస్ సంఘటనలో 20ఏండ్ల యువతిపై అత్యాచారం చేసి నాలిక కోసి హత్య చేశారన్నారు. ఇలాంటి కార్పొరేట్ అనుకూల, మతోన్మాద బీజేపీని 2024లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు డి. పోశెట్టి, తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజమణి, కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షులు గంగామణి, కోశాధికారి శైలజ, దేవిక, లావణ్య రమ్య తేజ, చిత్ర, పరదాన, ప్రేమల, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నవీన్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, పెండింగులో ఉన్న 3నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా అధ్యక్షులు టి.దివాకర్ అధ్యక్షతన ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద బడుగు ప్రజలకు సేవ అందించడంలో ఈ ఉద్యోగులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వీరిని శ్రమదోపిడీకి గురిచేస్తోందన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అలాగే 7నెలల ఏరియర్స్ వెంటనే ఇవ్వాలన్నారు. ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2వ ఏఎన్ఎంలు గతంలో సమ్మె చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, కాని నేటివరకు హామీని అమలు చేయడం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయకుంటే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఎన్ఎంల జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, నాయకులు భూదేవి, సునీత, ఆర్బిఎస్కే డాక్టర్లు సిబ్బంది రాకేష్, శ్రీకాంత్, కౌటిల్య, కీర్తి, సౌమ్య, అన్నపూర్ణ, ముస్తక్, మాయ పాల్గొన్నారు.

ఓసీ సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఓసీలోని సీహెచ్‌పీలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా అన్నారు. గురువారం డిప్యూటీ జనరల్ సెక్రటరీలు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్యతో కలిసి గని మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో కన్వీన్స్ వెహికల్ సమస్య అధికంగా ఉన్నందున కార్మికుల రవాణా కొరకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీని ప్రభావం ఉత్పత్తి ఉత్పాదకతపై చూపుతుందన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో కూడా కన్వేన్స్ వెహికల్స్ సమయానికి రానందున అక్కడ వోల్వో వెహికిల్ ని నిలిపి కన్వేన్స్ వెహికల్స్ రాక కోసం వేచి చూసే క్రమంలో ప్రమాదం జరిగిందని, ఇలా ఉత్పత్తి, రక్షణ, కార్మికుల సౌకర్యం పై పలు రకాల సమస్యలు కన్వేన్స్ వెహికల్స్ సరిపడ సంఖ్యలో లేనందున పై రకాల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే కన్వేన్స్ వెహికల్స్‌ని సరిపడేంత ఏర్పాటు చేయాలన్నారు. ఇంతకు మునుపు ఆఫీసు నుండి ఉన్న దారిని కొనసాగిస్తూ రాకపోకల సమస్యను తీర్చాలని, మహిళా సిబ్బంది కూడా ఆఫీసు నుండి దారి ఏర్పాటు చేస్తే వారు నిత్యావసరంలో భాగమైన మరుగుదొడ్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారం దిశగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూర్ కొమురయ్య, బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, అధికార ప్రతినిధి గండి సతీష్, పిట్ సెక్రటరీ మోత లచ్చన్న, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నల్లపు సత్తయ్య, పిట్ ఉపాధ్యక్షులు ఇతినేని శంకర్ పాల్గొన్నారు.



మొక్కలు నాటి సీసీ కెమెరాల పరిశీలన

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుప్టి గ్రామంలో సామాజిక కార్యకర్త కొయ్యాది గంగయ్య, తెలంగాణా పార్క్‌లో ఎస్ఐ శ్రీకాంత్ గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్నారు. ప్రతి ఒక్కరు చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు యాదవ్, ఉపసర్పంచ్ నరేష్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మందుల రమేష్, వీడీసీ చైర్మన్ శ్రీధర్, మాజీ చైర్మన్ నవీన్‌చారి, వెంకటరమణ, కళ్లెం భోజన్న, నక్క. నరేష్, రమణ, వెంకటరమణ గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
2
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

సమాజంలో మహిళలకు ప్రాధాన్యతనివ్వాలి

నవతెలంగాణ-ఉట్నూర్



సమాజంలో మహిళలకు ప్రాధాన్యతనివ్వాలని ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత అన్నారు. గురువారం కుటుంబంలో గృహిణి పాత్ర చాలా ఉన్నతమైనదని అన్నారు. మహిళల శక్తిని గుర్తించిన, ప్రభుత్వం మరుసటి ఏడాది పార్లమెంట్లో సమాన వేతన చట్టాన్ని ఆమోదించింది. మహిళలు ఉద్యోగమే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మహిళా అంటే భార్యగా, తల్లిగా, కోడలిగా, గృహిణిగా అహర్నిశలు శ్రమించే సేవలకు అతీతమైన విలువలు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

ప్రతి ఒక్క మహిళ ముందుకు రావాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మహిళలు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ అన్నారు. మండలంలోని లింగోజితండా గ్రామపంచాయతీ పరిధిలో గల న్యూ నలంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. బానోత్ జగన్ నాయక్, చవాన్ సేవాదాస్ ముఖ్య అథితిగా హాజరై మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జాదవ్ గణపత్ నాయక్, కరెస్పాండంట్, ప్రిన్సిపల్ జాదవ్ వసంత్ రావ్, ఉపాధ్యాయులు లింగన్న, వెంకటేష్, కృష్ణ మౌనిక, ఉమాదేవి, పూజ, సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రం లోని దీక్షా జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జవాబు పత్రాల తరలింపు సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 5,819 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 5,588 మంది హాజరయ్యారని తెలిపారు. 231 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో సామాజిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వంట గ్యాస్ సబ్సిడీ కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫోన్ నెంబర్, ఆధార్, గ్యాస్ కన్స్యూమర్ ఐడీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులలో తప్పులు నమోదైతే వాటిలో వివరాలు సరిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ గోవింద్, ఎంపీడీఓ గజానంద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడిగా గౌరీకర్ రాజు

నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ ఖానాపూర్ పట్టణాధ్యక్షుడిగా గౌరికర్ రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆయన పేరును ప్రకటించారు. పార్టీకి ఉత్తమ సేవలు అందిస్తు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని గౌరికర్ రాజును బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీకర్ రాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తనను నియమించినందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-పెంబి

పెంబి నూతన ఎస్సైగా ఆర్.శంకర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై పెంబి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కాగా మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, శంకర్, నరేష్, సురేందర్, ఇస్మైల్, మతిన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఇంద్రవెల్లి పిట్టబొంగరం పీహెచ్‌సీ వైద్యులు వేర్వేరుగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం కుష్టు వ్యాధికి చరమగీతం పాడాలనే ఉద్యేశంతో కంకణం కట్టుకుందన్నారు. ఈ నెల 11 నుంచి 24 వరకు వివిధ గ్రామాల్లో డోర్ టు డోర్ సర్వేను ఆశ, వైద్య సిబ్బంది సంయుక్తంగా పకడ్బందీ సర్వే నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి ఒక చర్మ వ్యాధి అని సమాజంలో ఈ వ్యాధిపై అపోహలను తొలగించాలని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, ప్రతాప్ నాయక్, సిబ్బంది సందీప్, శ్రీనివాస్, జ్యోతి, కాంతమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 591 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్ష (మ్యాథమెటిక్స్, జువాలజీ, హిస్టరీ) ప్రశాంతంగా జరిగిందని డీఐఈఓ రవీంద్ర కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 591 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8109 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 7518 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.

మాజీ డీసీసీ అధ్యక్షునిపై సస్పెన్షన్ ఎత్తివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు భార్గవ్ దేశ్పాండేపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సూచనతో భార్గవ్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ డా.చిన్నరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గత నవంబర్ 24న భార్గవ్‌ను పార్టీ 5 ఏండ్ల పాటు సస్పెండ్ చేసింది. కాగా ఆయనతో పాటు పార్టీ క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డిలపై సస్పెన్షన్ ఇంకా ఎత్తివేయలేదు.

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన రాజర్షి షాను జర్నలిస్టులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం జర్నలిస్టు జేఏసీ కన్వీనర్ నూకల దేవేందర్, కో కన్వీనర్ టీర్యార్‌వార్ వెంకటేష్ నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి, పూలబొకే అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు కలెక్టర్‌తో పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, వీడియో, ఫోటోగ్రాఫర్లు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తలమడుగు : మండల కేంద్రం లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పూలజ బాబా ధ్యాన మందిరంలో గ్రామ మహిళలను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి సత్కారించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కన్వీనర్ రాజేశ్వర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఈజీఎస్ ఏపీఓ మేఘ మాల, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, నల్ల దేవన్న, నల్ల పద్మకర్ రెడ్డి, పోశెట్టి, సునీత పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని పలు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. నలంద కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి పరీక్షలు కొనసాగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడి పరీక్ష జరుగు తీరును విద్యార్థులకు అవసరమయ్యే సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ రవీందర్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ పున్నారవ్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆడపిల్లలను ప్రోత్సహించాలి

- నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



ఆడపిల్లలను తల్లిదండ్రులు బాల్యం నుంచే ప్రోత్సహించాలని నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. పిల్లలకు చదువుతో పాటు తమకు ఇష్టమైన కళలు, ఇతర రంగాల్లో ఉన్న అభిరుచిని తెలుసుకొని, వారికి చేయూత నివ్వాలి. సమాజంలో సైతం తమకంటూ ఒక స్థానం కల్పించేలా చైతన్య పరిచాలి. ప్రస్తుత కాలంలో మగవారికి దీటుగా మహిళలు ఏ మేరకు తక్కువ కాకుండా విజయాలు సాధిస్తున్నారు. అంతేకాకుండా కల్పనా చావ్లా లాంటి ఓ మహిళ అంతరిక్షానికి వెళ్లింది. దేశ విదేశాలతో పాటు మన దేశంలో సైతం ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు, మంత్రులు రాజకీయ పరంగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఎన్నో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సైతం సాధించిన దాఖలాలు ఉన్నాయి. మగవారికి ఏమాత్రం తక్కువ కాకుండా మహిళలు నేడు రాణిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం మన దేశానికి రాష్ట్రపతి అయిన ద్రౌపతి ముర్మ మహిళ అని మర్చిపోవద్దు. నాటి నుండి నేటి వరకు మహిళలు తమ సాధికారతను సాధిస్తూనే వస్తున్నారు. కానీ దురదృష్టం ఏమంటే ఈనాటికి దేశంలో చిన్నారులపై, ఆడపిల్లలపై, మహిళలపై హత్యలు, అత్యాచారాలు వేధింపులు గురవుతూనే వస్తున్నారు. దీనికోసం ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేకమైన చట్టాలు తీసుకువచ్చి అమలు చేయాలి. మహాత్మా గాంధీ కలలు కన్నట్టుగా అర్ధరాత్రి మహిళలు ఒంటరిగా తిరిగినప్పుడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ, స్వతంత్రం వస్తుందని గుర్తుంచుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి చార్జీలు లేకుండా అమలు చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి చార్జీలు లేకుండా అమలు చేయాలని గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలలో గెలవడం కోసం అడ్డగోలుగా ఇచ్చిన హామీలన్నింటిని తూచా తప్పకుండా అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 25 లక్షల 44 వేలమంది లబ్ధిదారులపైన కనీసం లక్ష రూపాయల చొప్పున భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. ఈ మొత్తం రాష్ట్ర ప్రజల నుంచి ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.20వేల కోట్లకు పైగా భారం పడుతుందని అన్నారు. అధికారంలో లేనప్పుడు ఒక తీరుగా అధికారంలో వచ్చినాక మరొక తీరుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల కుటుంబాలకు లబ్ధి జరిగేలా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి చార్జీలు లేకుండా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు రాజా గంగన్న, పట్టణ అధ్యక్షుడు గౌరీకర్ రాజు, మాజీ జెడ్పీటీసీ రాము నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, శనిగారపు శ్రవణ్, సుమన్, నల్ల చంద్రహాస్, ఎనుగందుల నారాయణ, సంద రాకేష్, చింటు, రహీం, అర్షద్ ఖాన్, మజర్‌ఖాన్, బాబర్, కలిమ్, దయాకర్, నరేష్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాసిరకం రోడ్డు వేస్తున్న పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ -జన్నారం

మండలంలోని ధర్మారం గ్రామం, గోండుగూడ నుంచి గోదావరి వెళ్లే రహదారికి, వేస్తున్న నాసిరకం రోడ్డు వేస్తున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్లా అన్నారు. గురువారం, పనులు జరుగుతున్న రోడ్డును పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, రోడ్డుపై అక్కడక్కడ కంకర పోస్తూ, మొరం చల్లుతూ, నీళ్ల పట్టకుండానే, క్యూరింగ్ చేయకుండానే వదిలేస్తున్నారన్నారు. రోడ్డురోలర్‌తో తొక్కకుండానే, నాసిరకంగా రోడ్లు వేసి, కాంట్రాక్టర్ చేతులు దులుపుకుంటున్నాడన్నారు. ఆ రోడ్డుకు ప్రతిరోజు, గోదావరికి వెళ్లేవారు. అటువైపు చేనులలోకి పొలాల్లోకి వెళ్లే రైతులు, నిత్యం రద్దీగా ఉంటారన్నారు. అలాంటి రోడ్డును, నాసిరకంగా వేస్తే, అది త్వరగా చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత అధికారులు స్పందించి, వెంటనే ఆ పనులను ఆపి, రోడ్డు ను నాణ్యతగా వేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే, వెంటనే వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. అధికారులు స్పందించి రోడ్డును సక్రమంగా వేయాలని కోరుతున్నామన్నారు.

సమర్థవంతంగా కేంద్రాల నిర్వహణ

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ హసీన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల పరిధిలోని 22 అంగన్‌వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా సేవలను అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ హసీన అన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. గర్భిణులు, పిల్లలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుండి వచ్చే సరుకులు అందేలా చర్యలు చేపడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక అభియాన్‌లో భాగంగా ప్రతి ఒక్కరు తీసుకొనే ఆహారంపై అవగాహన కల్పిస్తున్నాం. కేంద్రాల్లో బాలమృతం, గుడ్లు, మిల్లెట్ ఫుడ్ అందిస్తున్నాం. గర్భిణీలకు రక్తహీనతతో బాధపడకుండా వారు తీసుకొనే ఆహారంపై సూచనలు చేస్తున్నాం. కేంద్రాలకు పిల్లలు వచ్చేల ఆట వస్తువులతో పాటు ప్రీ స్కూల్ విద్యను అందించడం జరుగుతుంది. పిల్లలకు ప్రతిరోజు భోజనంతో పాటు గుడును అందిస్తున్నాం. ప్రతినెల అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తూ అందరికి సరుకులు అందేలా చూస్తున్నాం. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడం లేదని నా దృష్టికి వచ్చింది. వారితో మాట్లాడి సమయానికి అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలని వారిని హెచ్చరించాను. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు సమయపాలన పాటించేలా ఆదేశించాం. మహిళలపై వివక్ష తగ్గినప్పుడే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రాగలరు.

మహిళలకు ఎన్ని హక్కులున్నా మహిళలను సమాజంలో ఇంకా చిన్నచూపు చూస్తున్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వాలు మహిళలకు ఇంకా రక్షణ కల్పించాల్సి ఉంది.

మహిళలకు ఉద్యోగాల కల్పనలో సింగరేణి భేష్

నవతెలంగాణ-రెబ్బెన

మహిళలు నేటి ప్రపంచంలో లింగబేధం లేకుండా అన్ని అవకాశాలను అందించుకుంటూ మగవారితో సమానంగా విద్యనభ్యసిస్తూ ఎదగడాన్ని యావత్ మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రత రక్షణకు తీసుకొచ్చిన చట్టాలను పూర్తిస్థాయిలో మహిళలకు న్యాయం చేకూరే విధంగా అమలుచేయాల్సిన అవసరముంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల హక్కులు, సమాన పనికి సమాన వేతనం, మహిళలకు ఓటు హక్కు కల్పించే దిశగా ఆనాటి పోరాట ఫలమే నేడు మహిళలకు ఓటు హక్కుతో పాటు సమాన పనికి సమాన వేతనం లభిస్తుంది. రాజ్యాంగపరమైన చట్టాలతో పాటు న్యాయపరమైన చట్టాలను మహిళల పట్ల మరింత పటిష్టం చేస్తూ ప్రభుత్వాలు తోడ్పడాలని కోరుకుంటున్నా.

మహిళా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉంది

యు.జ్యోష్న, రెబ్బెన మండల తహసీల్దార్

లింగ సమానత్వం పట్ల అవగాహన కల్పించడానికి, అందరికి సమాన హక్కులు కల్పించడానికి ప్రపంచ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటుంది. సమాన హక్కులు, మహిళలపై హింస, పునరోత్పత్తి హక్కులు వంటి మహిళల సమస్యలను పరిష్కరించడానికి ఈ రోజుకు ప్రత్యేక ప్రాముఖ్యత, ఈ అవకాశాన్ని కలిగి మహిళలకు పురుషులతో సమానంగా అంచలంచెలుగా ఎదుగుతూ అన్ని రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మేము ఇంటి పనులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో మహిళలు ఉద్యోగాలు చేస్తూ స్థిరపడడం ఎంతో సంతోషకరమన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. మండల ప్రజలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి ఉద్యోగం ఆనందంగా ఉంది

ప్రణీత, సింగరేణి మహిళా ఉద్యోగి, జనరల్ మజ్దూర్



మాది మారుమూల గ్రామీణ ప్రాంతం. అటువంటి తనకు సింగరేణి పరిశ్రమలో పీడీఎఫ్ క్రింద [illegible] కోల్పోవడంతో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. సింగరేణిలో మహిళలు సైతం మగవారితో సమానంగా ఉద్యోగం చేస్తున్నారు. మారుతున్న కాలానుగుణంగా గిరిజన గ్రామాల్లోనూ విద్యావిధానం పెంపొందించి అందరికి విద్యనందించడంతో గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న బాలబాలికలకు విద్యాబోధన మరింత చేరువైందని చెప్పవచ్చు. దీంతో కొండకోనల్లో నివసిస్తున్న గిరిజనులు సైతం నేటి పోటీ ప్రపంచంలో అందివస్తున్న అవకాశాలను సైతం అందుకుంటున్నారు.

ఉదయాన్నే పనుల్లో చేరాలి

నవతెలంగాణ-జైపూర్

ఎండలు ముదురుతున్నందున ఉదయాన్నే పనుల్లో చేరిపోవాలని ఉపాధి కూలీలకు కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ముదిగుంట శివారుల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. నిర్దిష్టమైన కొలతల్లో పనులు పూర్తి చేస్తే తప్పా కూలీ గిట్టుబాటు కాదని తెలిపారు. ఆలస్యంగా పనుల్లో చేరి అసంపూర్తి పనులు చేస్తే కూలీ డబ్బులు పడవని సూచించిన కలెక్టర్ ప్రతి కూలీ రోజు వారి కూలీ రూ. 272 పొందాలని అన్నారు. అప్పటి వరకు నిర్వహించిన పనులను పరిశీలించి, నిర్దేశించిన కొలతల్లో పనులు పూర్తి చేసిన తీరును పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్వీప్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఓటరు అవగాహణ సదస్సు ర్యాలీ నిర్వహించడంతో పాటు మహిళలు ప్రదర్శించిన స్వీప్ ప్రోగ్రాంకు సంబంధించిన రంగవల్లులను తిలకించారు. విజేతలుగా గుర్తించిన మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సంతోష్‌తో పాటు డీఆర్‌డీఓ క్రిషన్, అడిషనల్ డీఆర్‌డీఓ దత్తారామ్, స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల్లో అంతర్గత అభ్యర్థులతో భర్తీ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి బొగ్గు గనుల్లో గల ఆయా విభాగాలకు సంబంధించిన 173 ఉద్యోగ ఖాళీల్లో అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేస్తున్నట్లు జీఎం పర్సనల్, వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కే బసవయ్య తెలిపారు. ఈ మేరకు ఈ నెల 6న ఉద్యోగ ఖాళీలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. జూనియర్ మైనింగ్ ఆఫీసర్ పోస్టులు 87, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (మెకానికల్) పోస్టులు 28, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఎలక్ట్రికల్) పోస్టులు 21, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (సివిల్) పోస్టులు 11, జూనియర్ ఆఫీసర్ (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) పోస్టులు 4, జూనియర్ ఆఫీసర్ (అకౌంట్స్) పోస్టులు 4, బయో కెమిస్ట్ పోస్టులు 1, జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ పోస్టులు 12, జూనియర్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 5 నోటిఫికేషన్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు మార్చి 20 నుండి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని పూర్తి వివరాల కోసం సింగరేణి వెబ్‌సైట్ చూడాలని తెలిపారు. కాగా గత నెలలో సింగరేని సంస్థలో మొత్తం 321 పోస్టులకు ప్రత్యక్ష నియామకాల పద్దతిలో భర్తీ చేయుటకు మొదటి విడతగా 272 పోస్టుల భర్తీ కోసం 2024 ఫిబ్రవరి 22న ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మిగితా 49 పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పోస్టుల నియామకానికి వ్రాత పరీక్ష ఆధారంగా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, ఎవ్వరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దని హెచ్చరించారు.

ప్లాస్మా స్టోరేజ్ డీప్ ఫ్రీజర్ విరాళం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల నుండి రూ.8 లక్షల విలువ గల ప్లాస్మా స్టోరేజ్ డీప్ ఫ్రీజర్ మంచిర్యాల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకుకు యాజమాన్యం విరాళంగా అందించారు. ఈ మేరకు గురువారం దేవాపూర్ ఓరియంట్ కంపెనీలో చేపట్టిన కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి మాట్లాడుతూ ఓరియంట్ ప్రెసిడెంట్ సత్యబ్రత శర్మ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల నుండి మంచిర్యాల జిల్లా ప్రజల కోసం, ప్రభుత్వ ఆస్పత్రిలోని నిరుపేదల వైద్యం కోసం, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం కలెక్టర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచన మేరకు అందించినట్లు తెలిపారు. జిల్లాలోని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్మా డీప్ ఫ్రీజర్ ఎంతో ఉపయోగపడుతుందని, జిల్లా ప్రజల తరపున దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్యానికి, కలెక్టర్ బాధావత్ సంతోష్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెచ్‌ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, మెటీరియల్ జీఎం బాల మురళి, లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు చందూరి మహేందర్, కాసర్ల శ్రీనివాస్, సురభి శరత్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ బెల్లంపల్లి సబ్ డివిజన్ సభ్యుడు సూరం లక్ష్మీనారాయణ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ రంగినేని మనీషా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆర్థిక సహకారంతో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రంగినేని మనీషా, గౌరవ అతిథిగా విశ్రాంత అధ్యాపకురాలు సుజాత, ప్రత్యేక అతిథిగా నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త సుశీల్ పాల్గొన్నారు. అనంతరం అతిథులను, ప్రిన్సిపల్‌ను, కళాశాల మహిళ అధ్యపకులను, మహిళా అటెండర్‌లను శాలువతో సత్కరించారు. అనంతరం వివిధ రంగాలలోని మహిళల పాత్రలతో విద్యార్థినిలు ప్రదర్శించిన నాటిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్ రావు, మహిళా సాధికారిక విభాగం సమన్వయకర్త సప్న, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో జరిగింది. ఏఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన తోకల పోషన్న(70) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కనకపూర్ వైపు వస్తున్నాడు. మార్గ మధ్యలో పీచర శివారులో దుబ్బ రాజేశ్వర దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఢీకొట్టాడు. పోషన్న తలకు ట్రాక్టర్ ట్రాలీ బలంగా తాకడంతో అక్కడిక్కడే తీవ్ర గాయామై మృతి చెందాడు. మృతుడి భార్య తోకల లక్ష్మి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గుంజ శంకర్‌పైన కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

ఆకట్టుకున్న పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అందరిని ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల సమితి ప్రముఖ్ పూదరి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సరస్వతి శిశు మందిర్‌లో చదువుకున్న వారు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. సమాజంలో ప్రవర్తించాల్సిన తీరు పాఠశాలలో నేర్చుతారని దీనికి శిశు మందిరాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఉన్నత విలువలు కలిగినప్పుడే ఆదర్శప్రాయంగా ఉంటారన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగిన ఒదిగి ఉండాలని సూచించారు. అనంతరం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు నాగుల శ్రీనివాస్, విశాల్, మధుకర్, శ్రీనివాస్, హరిప్రియ, రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైవే రోడ్డు పనులను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ రోడ్డు పనులను కుమురం భీం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాసిరకంగా సైడ్ డ్రేన్లు నిర్మిస్తుండడంతో నీరు వెళ్లకుండా మురికినీరు చేరి దోమలు పెరిగిపోతున్నాయని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇందిరానగర్, పోచమ్మబస్తి, శివాజీనగర్ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఎన్‌హెచ్‌ఏఐ వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసి సరైన అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని, ఈవీఎం, వీవీప్యాట్ అవగాహన కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసి ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించి అర్హులైన వారికి కేటాయించిన నమూనాలో రేషన్ కార్డు నెంబరు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, తదితర లబ్ధిదారుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల హామీ అమలులో భాగంగా ప్రజాపాలన ప్రక్రియలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సవరించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, ఇందుకు అర్హులైన అభ్యర్థులు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీవీ ప్యాట్ కేంద్ర పరిశీలన సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే సమర్థవంతమైన నాయకత్వం ఎన్నిక జరుగుతుందన్నారు. ఎన్నికలలో పోలింగ్ రోజున ఓటు వేసే విధానాన్ని వివరించేందుకు ప్రజల సౌకర్యం కోసం అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీగా సీట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఉమ్మడి గురుకులాల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ పోలోజు బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఈ నెల నాల్గవ తేదీ నుండి 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో, తెలంగాణ గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్థానికంగా ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్, టీటీడబ్ల్యూఆర్ గురుకులాల్లో సంప్రదించాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 21న ఉంటుందని అభ్యర్థులు గమనించి సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ముస్తాబవుతున్న ఆలయాలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయంలో నేడు జరుగనున్న శివపార్వతుల కళ్యాణం సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామ సమీపంలో గల భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులు జాతరను నిర్వహిస్తున్నట్టు అర్చకులు శివప్రసాద్ తెలిపారు.

ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారెంటీ పథకాల్లో ఉన్న గృహలక్ష్మికి సంబంధించిన ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ కోసం గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఏవైనా తప్పులుంటే సరిచేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రంలో లబ్ధిదారుల నుండి అర్జీ పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ పథకంలో తమ పేర్లు నమోదు కాకున్నా, ఆధార్, ఫోన్ నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ తదితర వివరాలను సరిగా లేనిపక్షంలో లబ్ధిదారులకు పథకం వర్తించదని, తప్పనిసరిగా ప్రజాపాలన సేవా కేంద్రానికి వచ్చి పత్రాలు ఇవ్వాలన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభించిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 73వ వర్ధంతి సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించగా జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం ఏర్పడి ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-కెరమెరి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అందరూ గౌరవించాలని, మహిళా అభివృద్ధితోనే కుటుంబాలు బాగుపడుతాయని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ, మహిళ సంఘాల నాయకురాలు, ఆయాలను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డల వెంకటేశం, అంగన్‌వాడీలు గుణ సుందరి, సవిత పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ చేసిన రాష్ట్ర బృందం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. జిల్లాలోని వాంకిడి ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెంటర్లలో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి కళాశాల ప్రిన్సిపల్ సంపత్ కుమార్, డీఓ ఆత్మారాం, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన రాష్ట్ర బృందం

జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను రాష్ట్ర బృందం సభ్యులు ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్లు యాదగిరిరావు, షర్ఫుద్దీన్ తనిఖీ చేశారు. జిల్లాలోని సెల్ఫ్ సెంటర్లు అయిన వాంకిడి, కెరమెరి, రెబ్బెన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ తెలిపారు. జిల్లాలోని 19 సెంటర్లలో గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలో భాగంగా 3057 మంది హాజరుకానుండగా 2982 మంది హాజరయ్యారని, 75 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆశ్రమ పాఠశాల నిర్వహణపై ఐటీడీఏ పీఓ ఆగ్రహం

- జోడేఘాట్‌ను సందర్శించిన ఖుష్బు గుప్తా

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని జోడేఘాట్ ఆశ్రమ పాఠశాల నిర్వహణపై ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని జోడేఘాట్ పర్యటనకు వెళ్లిన ఆమె కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఆదివాసుల సంప్రదాయ పనిముట్లు, ఇతర వస్తువులను పరిశీలించారు. అక్కడ గ్రామస్తులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిరిగి వస్తున్న క్రమంలో ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పరిసరాలు, ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు పట్టికలు, పలు రికార్డులను పరిశీలించారు. భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సరఫరా కోసం ఉంచిన నల్లాలు ఎక్కడివని ప్రశ్నించగా ఆర్వో ప్లాంట్ ఉందని అక్కడి నుండి సరఫరా కోసం నల్లాలు ఏర్పాటు చేశామని సిబ్బంది తెలిపారు. ఆర్వో ప్లాంట్



ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ వద్ద నీటి సమస్యను తెలుసుకుంటున్న పీఓ



భీం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా

చూపెట్టమని అడగగా అక్కడికి ఏటీడీఓతో సహా పాఠశాల సిబ్బంది అక్కడికి తీసుకువెళ్లారు. ఆర్వో ప్లాంట్ నుండి తాగు నీరు వచ్చేలా ఏర్పాటు చేసిన కుళాయి ద్వారా నీళ్లు రాకపోవడంపై ప్రశ్నించారు. ప్లాంట్‌లో నీరు లేక పోవడాన్ని గమనించిన ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉన్న ఇబ్బందులు తన దృష్టికి తీసుకురాకుంటే పరిష్కారం ఎలా అవుతాయని మండిపడ్డారు. సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా ఉన్నారని ఇలా చేస్తే భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే సందర్భంలో ఏటీడీఓతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, హెచ్‌డబ్ల్యూఓకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఏది ఏమైనా పాఠశాలలో ఉన్న పరిస్థితి ఉన్నతాధికారులకు వివరించకపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు పై స్థాయికి వెళ్లడం లేదని మరోసారి నిరూపితమైంది. ప్రాజెక్టు అధికారిణి చేసిన తనిఖీని పలువురు అభినందిస్తున్నారు. పీఓతో పాటు డీటీడీఓ రమాదేవి, ఏటీడీఓ పురుషోత్తం, హెచ్‌ఎం మోతీరాం, కుమురం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినంతరం జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసున్న మధ్యాహ్న భోజన కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు, టిఫిన్స్ బిల్లులున్నాయని వాటిని విడుదల చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల వేతనం చెల్లింపులు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని గతంలో వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది కానీ నేటికి చెల్లింపులు చేయకపోవడంతో కార్మికులు అప్పులు చేసి వంట చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలనీ మధ్యాహ్న భోజన నిర్వహణ స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వకూడదనీ, కార్మికులకు గుర్తింపు కార్డులు ప్రభుత్వమే జారీ చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎండీఎం కార్మికులు, సీఐటీయూ నాయకులు

భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొట్రంగి శారద, పగిడి మాయ, మండల నాయకులు తిరుపతి, విజయ, శ్యామల, పద్మ, వనిత, బాయక్క, విఠ్ఠబాయి, బావునే బాబురావు, ప్రణీత, అనసూయ, మీరాబాయి, భీంబాయి, కైలాష్, ఊర్మిళ, గిరుజాబాయి, భీంరావు, ఎల్కరి పార్వతీ, శ్రీలత, సువర్ణ పాల్గొన్నారు.

మహిళాలలే మహారాణులు : టీజీబీ ఆర్ఎం



మెమెంటోను ఇచ్చి శాలువాతో సన్మానించిన మహిళతో ఆర్ఎం

నవతెలంగాణ-కౌటాల

సమాజంలో మహిళాలే మహారాణులని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మంచిర్యాల రీజినల్ మేనేజర్ మురళీ మనోహర్‌రావు అన్నారు. గురువారం మేనేజర్ నరసింహస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పురుషులతో సరి సమానంగా మహిళలు అన్ని హక్కులు సాధించుకొనేలా ముందుండాలన్నారు. కౌటాల బ్యాంకు శాఖ పరిధిలో గల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలకు సంబంధించిన ఉద్యోగులు సమాజంలో సగమైన మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి వృత్తి వ్యాపారాల్లోకి విస్తరింపచేయాలన్నారు. కౌటాల శాఖ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ముందుకు తీసుకెళ్లడానికి అహర్నిశలు తమవంతుగా పనిచేస్తామన్నారు. అనంతరం 16 మంది మహిళలకు జ్ఞాపిక అందజేసి శాలువాలతో సత్కరించారు. ఐకేపీలో పనిచేస్తున్న 16 మంది మహిళలు ఐకేపీ అధ్యక్షురాలు కొండ కమల, ఐకేపీ కమిటీ కార్యదర్శి కడారి తులసమ్మ, అసిస్టెంట్ బోగర్ల తిరుపతమ్మ, కోశాధికారి దుర్గం మీరాబాయి, కంప్యూటర్ ఆపరేటర్ కామ్రె గీత, సీసీ వగాడె రాజమణి, కుసుమ, రాజేశ్వరి, కల్పన, శ్రీలత, వీఓఏలు జ్యోతి, పద్మ ప్రతిభ, ఇందూలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ, కౌటాల శాఖ ఫీల్డ్ అధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, క్యాషియర్లు గోపి, భాస్కర్, సీహెచ్‌వీ మోరేశ్, ఏపీఎం ముక్తేశ్వర్, సీసీలు శంకర్, తిరుపతి, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మూకుమ్మడిగా రాజీనామాలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలం ప్రజా ప్రతినిధులు నాయకులు బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామాలు చేశారు. బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ చౌరస్తా వద్ద నిరసన చేశారు. సిర్పూర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అసెంబ్లీ ఎన్నికల్లో గెలువకపోవడానికి కారకులైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ పొత్తును వ్యతిరేకిస్తు ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు 12మంది మాజీ సర్పంచ్లు, ఐదుగురు ఎంపీటీసీలు మూకుమ్మడిగా పార్టీ సభ్యత్వానికి రాజీనామాలు చేశారు. కోనేరు కోనప్పగారు ఏ పార్టీలో ఉన్న ఎక్కడున్న ఆయన వెంటే ఉంటాం అంటున్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరులు ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి వెంకన్న, వైస్ ఎంపీపీ మనోజిత్ మండల్, నాయకులు జాబర్ రాజన్న, జాటోత్ ధనరాజ్, సురేష్, బాల్గరపు రాజన్న పాల్గొన్నారు.



శివాజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- ఎస్పీ కే.సురేష్ కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తుగా పోలీస్ సిబ్బందితో జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు వచ్చే చోట చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. గత ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. పోలీసులు ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణ, క్రమశిక్షణకు లోబడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు తీసుకోవలసిన చర్యలు, సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సీఐ, ఆర్ఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దేవాదాయ కమిటీ అధ్యక్షుడు గాదె ప్రవీన్ తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జాతరలో చిన్న పిల్లల కోసం ఎగ్జిబిషన్‌తో పాటు వివిధ వ్యాపార సముదాయాలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. ఈ జాతరకు మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజూరా, బల్లార్షా, వరూర్, విరూర్, లకడ్‌కోట్, ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారని ఆయన తెలిపారు.

కఠోర సాధనతో మెరుగైన ఫలితాలు



నవతెలంగాణ-కెరమెరి

కఠోర సాధనతోనే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఏసీఎంఓ పుర్కా ఉద్ధవ్ అన్నారు. గురువారం మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమం పాఠశాలతో పాటు టీడబ్ల్యూ పీఎస్ చింతపల్లి, కోలాంగూడ, జైరాం గూడ, అందూగూడ, ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలోని తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల కనీస సామర్థ్యాలు తెలుసుకునేందుకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఏసీఎంఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 100 శాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం బలిరాం, డీఆర్పీ వామన్, వార్డెన్ వసంత్, ఎస్‌సీఆర్పీ నరేష్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలకు సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డిసెంబర్ ప్రిన్స్ ఫర్ సిస్టర్ మేరీ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన మందాడ నవీన్, బొమ్మన సాయి వర్ధన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 8 నుండి 10 వరకు వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరగనున్న పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. విద్యార్థుల క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులనుకరస్పాండెంట్ సిస్టర్ ఝాన్సీ, ఉపాధ్యాయులు పసల తామస్, మహిపాల్, సీతారాం సయ్యద్ మోషిన్, శైలజ, పీఈటీలు కడతల రాకేష్, బొమ్మకంటి కిరణ్, అర్చన కుమారి అభినందించారు.

బీటీ రోడ్డు పనులను పరిశీలించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-వాంకిడి

వాంకిడి నుండి కమాన వరకు రూ.1.5 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను కమాన ఎంపీటీసీ ఈవ్రె ప్రవీణ్ పరిశీలించారు. నాసిరకమైన మెటీరియల్ వాడకుండా నాణ్యతతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని గుత్తేదారును కోరారు. ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గతంలో వేసిన రోడ్డు నాణ్యత లేకపోవడంతో చెడిపోయిందని, పూర్తి నాణ్యతతో రోడ్డు నిర్మించాలన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు గృహ జ్యోతి పథకం అమలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గ్యారెంటీలలో భాగంగా జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం అమలు చేయడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందజేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గృహజ్యోతి పథకంలో నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో ర్యాంకు సాధిస్తా

● రాజీవ్‌నగర్ పంచాయతీ సెక్రెటరీ కల్పన

నవతెలంగాణ-తాండూర్



ఎప్పటికైనా సివిల్స్‌లో ర్యాంకు పొంది ఉద్యోగం సాధించి ప్రజాసేవకు అంకితం అవుతానని మండలంలోని రాజీవ్‌నగర్ పంచాయతీ కార్యదర్శి కల్పన అంటున్నారు. బాటనీలో ఎమ్మెస్ చేసిన కల్పన ఆదిలాబాద్ ఎస్సీ ఎస్టీ స్టడీ సర్కిల్‌లో కొన్నాళ్లపాటు లెక్చరర్‌గా సేవలందించారు. పరిస్థితులు అనుకూలించకున్నా పట్టుదలతో చదివి పంచాయతీ సెక్రెటరీ ఉద్యోగం సంపాదించారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సివిల్స్ ప్రిపేర్ అవుతున్నారు. గతంలో సివిల్స్ గ్రూప్-2లో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. పట్టుదలతో సివిల్స్‌లో ర్యాంక్ సాధించి ప్రజాసేవకు అంకితం అవుతానని తెలిపారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మండలంలోని దౌడేపల్లి గ్రామానికి చెందిన సొప్పరి సత్తయ్య(61) పంటకు కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గత మూడు రోజులుగా కడుపు నొప్పితో అవస్థ పడుతున్నాడు. భార్య ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించుకుందాం అంటే పండగ తర్వాత వెళ్దాం మాత్ర వేసుకుంటే తగ్గిపోద్ది అంటుండేవాడు. నిన్న రాత్రి కూడా కడుపునొస్తుంది అని భార్యతో చెప్పి తిని పడుకున్నాడు. ఉదయం లేచి పొలంకు మందు కొట్టాలని చెప్పి ఇంట్లో ఉన్న మందు ప్యాకెట్ తీసుకొని చెల్లంపేట రావికుంట చెరువు పక్కన ఉన్న పొలం వద్దకు వెళ్లి చెరువు కట్టపై బైక్ పెట్టి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి చనిపోయాడు. మృతుడి భార్య సొప్పరి గంగామని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

దేశాన్ని పాలించే వరకు మహిళల పాత్ర కీలకం

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్ : మహిళా దినోత్సవంలో మహిళను సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుండి దేశాన్ని పాలించే వరకు అన్ని రంగాలలో మహిళల పాత్ర కీలకమైనదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజికంగా ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, దేశ ప్రథమ పౌరురాలి స్థానంతో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఆర్మీ, నేవి, ఎయిర్‌ఫోర్స్, శాస్త్రవేత్తలుగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ప్రతి రంగంలో వారి ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళలు సాధిస్తున్న విజయాలకు గుర్తింపునిచ్చి మరింత ప్రోత్సాహించాలన్నారు. లింగ బేధం లేకుండా అబ్బాయిలు, అమ్మాయిలను ఒకేలా చూస్తూ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. దీంతో మహిళలు ఎదగడానికి ఎక్కువ అవకాశాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఓర్పు, సహనంతో కుటుంబాన్ని తీర్చిదిద్దడంతో పాటు సంస్కారం కలిగిన భావితరాలను అందించడంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని, మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక భద్రతా చర్యలు చేపడుతుందని తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కృషి చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహిస్తుందని, అన్ని రంగాలలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళాలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పని చేస్తామని అన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలలో భ్రూణ హత్యల నివారణపై విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన మోటార్ సైకిళ్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఠాగూర్ స్టేడియంలో పట్టణ మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన మహిళలకు చైర్‌పర్సన్ జంగం కళ బహుమతులు అందజేశారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మహిళలకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీ కృష్ణ, వైస్ చైర్మెన్ సాగర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ మహిళలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా అంజనీపుత్ర ఎస్టేట్ కార్యాలయంలో వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మెన్ శ్రీధర్, ఎండీ రవి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంజనీ పుత్ర ఎస్టేట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కిషన్, సంతోష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

తాండూర్ : మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం ఇచ్చినప్పుడే సమాజం పురోగాభివృద్ధి చెందుతుందని తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాజీవ్‌నగర్ తాండూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సాధికారత దిశగా అడుగులు వేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మహిళలు గృహస్థ జీవనంతో పాటు వైద్య రంగాల్లో సాధికారత సాధించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఈస మహిళలను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిరంగి శంకర్, దుర్గం మహేందర్, నల్లుల మహేష్, మతకుల రాజేశం, ఎగిడి వసంత, ఆదం ఖాన్, అఖిల్ భాయ్ పాల్గొన్నారు.

మందమర్రి : సింగరేణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మందమర్రి ఏరియాలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏరియా జీఎం ఎ.మనోహర్, సేవా అధ్యక్షురాలు సవిత మనోహర్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించడంలో సింగరేణి ఎప్పుడు ముందుంటుందని అన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించుకున్న ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్పెషల్ గెస్ట్ డివై ఎక్స్ ఇంజనీర్ ఐ అండ్ సిపిడి వై శారద, అడిషనల్ డివైసిఎంఓ ఏరియా హాస్పిటల్ డాక్టర్ ఎం ఉష, ఎస్ సత్యనారాయణ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మందమర్రి, ఎస్ రమేష్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్, ఎస్ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

జైపూర్ : మండల పరిషత్ పరిధిలో గల పలువురు మహిళా ప్రజా ప్రతినిధులతో పాటు మహిళా అధికారులను స్థానిక నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక వేదిక మీదుగా స్థానిక జడ్పీటీసీ భుక్య తిరుమల, ఖాజీపల్లి ఎంపీటీసీ పెద్దల రూప, మంచిర్యాల డీఎల్‌పీఓ ధర్మారాణి, స్థానిక ఎంపీడీఓ రాధ రాథోడ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల లయన్స్ క్లబ్ గౌతమి, అధ్యక్షుడు భీమా మల్లేష్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట : అంతర్జతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలం రంగంపేట అంబేడ్కర్ వారసుల కాలనీ అధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయురాళ్లు కె. దిన, అనురాధ, లావణ్యలకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, అంబేద్కర్ జిల్లా కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిప్పకుర్తి నారాయణ, మండల నాయకులు తోటపల్లి మహేందర్, చొప్పదండి మనోహర్, బిట్టిగు బాపు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు









మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

● జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి

నవతెలంగాణ-జైపూర్



పురుషులతో సమానంగా మహిళా మణులు అన్నిరంగాల్లో ముందుండాలి. చదువుతో పాటు ప్రతి రంగాల్లో మహిళలు సమానమైనప్పుడు హక్కులు కూడా సమానంగా ఉండాలి. రాజ్యాంగంలో మహిళ అభ్యున్నతి కోసం కల్పించబడిన చట్టాల పట్ల అవగాహణ పెంచుకోవాలి. చట్టం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకున్నప్పుడు మహిళలు ముందడుగు వేయగలరు. తమకు నచ్చిన రంగంలో రాణించడం కోసం ప్రయత్నిస్తూ సమాజంలో ఒకరుగా కాకుండా తనకంటూ ప్రత్యేకత అన్నట్టు గుర్తింపు పొందాలి. ముందుగా తమలో గల వెనుకబాటు తనం దూరం చేసుకోవాలి, మనోధైర్యంతో ముందుకు సాగాలి. రాజకీయాల్లో కల్పించిన రిజర్వేషన్ ద్వార పదవులు పొందిన మహిళలు తోటి మహిళల అభివృద్ధికి పాటు పడటంతో ఎప్పటికప్పుడు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రణాళికతో ముందుకెళితే విజయం సాధ్యం

● ఎంపీపీ గోదరి రమాదేవి లక్ష్మణ్

నవతెలంగాణ-జైపూర్



ఆసక్తికి అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగినప్పుడు విజయం తమ సొంతం అవుతుంది. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళలు ఇప్పుడు పురుషులతో సామానంగా అన్నిరంగాల్లో రాణిస్తుండటం మహిళా లోకానికి గర్వకారణం. విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్న మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయంగా, వ్యాపారాల్లో కూడా తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. అయినప్పటికి నేటి సమాజంలో మహిళలు ఇప్పటికీ అసమానతలు, అవమానాలు వేదింపులకు గురవుతుండటం బాధాకరం. ఇలాంటి సంఘర్భాలను నిలువరించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. పురుషులతో సమాన హక్కులు మహిళలకు కల్పిస్తూ ప్రోత్సహించాలి. మహిళలను గౌరవించడానికి ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయంగా మహిళ దినోత్సవం నిర్వహించుకోగా కొన్ని దేశాల్లో ఈ రోజును సెలవు దినంగా ప్రకటించారు. లింగ సమానత్వం, హింస, మహిళలకు సమాన హక్కులు కావాలంటూ ఎంతో మంది ఇప్పటికీ పోరాటం చేస్తున్నారు. మహిళా దినోత్సవం పుట్టుక వెనుక 15 వేల మంది అతివల అడుగులు ఉన్నాయి. పురుషులతో సమానమైన హక్కులు కావాలంటూ 1908లో న్యూయార్క్‌లో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ సమావేశం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ 2023-24 ఆర్థిక సంవత్సర సవరణ, 2024-25 ఆర్థిక సంవత్సరపు అంచనా బడ్జెట్ వార్షిక బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని గురువారం ఎంఎస్ఆర్ గార్డెన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ బడ్జెట్ సమావేశానికి చెన్నూర్ శాసన సభ్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి, జిల్లా అదనపు కలెక్టర్ బి. రాహుల్ హాజరయ్యారు. ఈ సమావేశంలో జేఏఓ సీహెచ్ అనితా దేవి బడ్జెట్ ఎజెండాను చదివి వినిపించారు. కౌన్సిల్, కో-ఆప్షన్ సభ్యులు బడ్జెట్‌ను ఏకగ్రీవముగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీ కృష్ణ, వైస్ చైర్మెన్ సాగర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు,రెంవెన్యూ అధికారి పి. కృష్ణ ప్రసాద్, మున్సిపల్ సహాయక ఇంజనీర్ అచ్యుత్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇ. వసంత్, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం పై అంతర్జాతీయ సెమినార్



నవతెలంగాణ-లక్సెట్టిపేట

జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమన్వయంతో సమీకృత విద్యా కార్యక్రమం వృక్ష శాస్త్రం, ఎన్ఎస్ఎస్ఎల్ మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయి అంతర్జాల సెమినార్లు నిర్వహించారు. ఈ సెమినార్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని 21వ శతాబ్దంలో మహిళ సాధికారత లీడర్షిప్, ప్రొఫెషనల్ డెవలప్మెంట్ వివిధ రకాల బాధ్యతలతో కుటుంబం నుంచి మొదలుకొని అంతరిక్షం వరకు అన్ని రంగాలలో మరైనా పాత్ర పోషిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త డాక్టర్ వి. సరిత రాణి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.టి.గంగయ్య పాల్గొన్నారు.

తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవ తెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై తనిఖీలు చేపట్టారు. ఓ ఆటోలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడంతో ఆ ఆటోను సీజ్ చేశారు. జరుపుల కాంతయ్యను విచారించగా రూ.16కు కిలో చొప్పున కొనుగోలు చేసి జన్నారంలోని ఓ వ్యక్తికి రూ.18 చొప్పున విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. బియ్యం, ఆటోను సీజ్ చేసి విచారణ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పామాయిల్ తోటల పరిశీలన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పామాయిల్ తోటలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా కొండాపూర్ శివారులో ఆయిల్ పామ్ మొక్కల్ని 90 శాతం రాయితీపై సాగు చేస్తున్న రైతుల తోట, బిందు సేద్య పరికరాల పని తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల అధిక లాభాలు వస్తాయని, నిర్వాహణ కోసం రైతులకు ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేండ్లు వస్తాయని, రాయితీ కూడా అందించడం జరుగుతుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిణి దేవులపల్లి వందన, మ్యాట్రిక్ కంపెనీ సీఈఓ ఉదయ్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ సీహెచ్ సుప్రజ, మాట్రిక్ ఫీల్డ్ ఎగ్జిక్యూటీవ్ బి.రాము, ఏఈఓ అంజలి, రైతులు చెల్ల రమేశ్, మాటేటి వెంకట చారి పాల్గొన్నారు.

బాక్సింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్ఓ కీర్తి రాజ్ వీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 8 నుండి 20 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బాక్సింగ్ క్రీడ నేర్పిస్తున్నామని, ఉదయం 6 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 నుండి 7 గంటల వరకు ఉచిత శిక్షణ తరగతులుంటాయన్నారు. శిక్షణలో పాల్గొనే వారు షూస్, టీ షర్ట్, స్పోర్ట్స్ కిట్‌తో రావాలన్నారు. ఇతర వివరాలకు 9963539234లో సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రిటైర్మెంట్ రోజే మెడికల్ కార్డు పెన్షన్ ఆర్డర్లు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ యాజమాన్యంతో 11వ వేతన ఒప్పందం జరిగి 2సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు కొత్త బేసిక్ ప్రకారం పెన్షన్ చెల్లించడం లేదని అన్నారు. పెన్షన్ ఏరియర్స్ బకాయిలను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. పదోవేతన ఒప్పందంలో కనీసపెన్షన్ వెయ్యి రూపాయలు ఇవ్వాలన్న దాన్ని ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. 2018 ఫిబ్రవరిలోపు దిగిపోయిన కార్మికులకు రూ.20 లక్షల గ్రాట్యూటీని చెల్లించాలని, దూర ప్రాంతాల నుండి జీఎం కార్యాలయంకు వచ్చే వారి కోసం కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు, వసతి ఉండే విధంగా ఒక రూంను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకట్ స్వామి, కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, లింగాల రమేష్, రిటైర్మెంట్ కార్మికులు రవీందర్ రెడ్డి, బాపు, నాగయ్య, రమణ, రాజయ్య, నరసయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి గురువారం గంగిపల్లిలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యంపై దృష్టి సారించిందన్నారు. శిథిలావస్థలో ఉన్న గంగిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నూతన పాఠశాల నిర్మించాలని మాజీ సర్పంచ్ లింగారెడ్డితో పాటు మండల నాయకుల అభ్యర్థన మేరకు ప్రత్యేక నిధులు రూ. 50 లక్షలతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్థానిక అంబానగర్ కాలనీవాసుల సౌకర్యార్థం బోరుబావి పనులు ప్రారంభించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే నాలుగు పథకాలు అమల్లోకి వచ్చాయని మిగితా రెండు పథకాలు త్వరితగతిన ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి అంగీకారం

మండల కేంద్రంలో నూతనంగా మండల పరిషత్ భవనం నిర్మించాలన్న ప్రతిపాదనకు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అంగీకరించారు. శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్‌ను ఆదేశించారు. అదేవిధంగా ప్రత్యామ్నాయంగా రూ.10 లక్షలతో ఏర్పాట్లు చేసుకోవడం కోసం నిధులు సమకూర్చేందుకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహమ్మద్ ఫయాజోద్దీన్, నాయకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, చల్ల సత్యనారాయణ రెడ్డి, రిక్కుల లక్ష్మీనారాయణ రెడ్డి, చల్ల విశ్వంబర్ రెడ్డి, జక్కుల వెంకటేశం, గోనె నర్సయ్య, శీలం వెంకటేశం, గుడెల్లి శ్రీనివాస్ రెడ్డి, జైనోద్దీన్, ముదాం రమేష్, బేద మల్లేష్, నామాల తిరుపతి, ప్యాగ లక్ష్మన్, డేగ నగేష్, కిరన్ గౌడ్, అన్నం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11,12 తేదీల్లో మండలంలోని తాటిగూడలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్ తెలిపారు. యువత చెడు దారి పట్టకుండా ఉండడం కోసం, గ్రామస్తుల సహకారంతో అడవులను అంతరించిపోకుండా ఉంచేందుకు, వన్యప్రాణుల, అడవుల సంరక్షణలో అందరి భాగస్వామ్యం ఉండాలని వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. దీంట్లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జట్లు డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్, 7337552556లో సంప్రదించాలని సూచించారు.

మేనిఫెస్టోలో మాలీల ఎస్టీ హోదా అంశం చేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల మేనిఫెస్టోలో రాజకీయ పార్టీలు మాలీలకు ఎస్టీ హోదా కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 23 సంవత్సరాలుగా ఆంధ్రాలో ఎస్టీలుగా ఉండి తెలంగాణలో బీసీలుగా ఉన్న మాలీ కులస్తులు ఎస్టీ హోదా కల్పించాలని అనేక పోరాటాలు చేశారని, ఆ పోరాట ఫలితంగా అసెంబ్లీలో తీర్మానమై ఆమోదం కోసం కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. కానీ ఆ బిల్లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఒకవేళ ఏ రాజకీయ పార్టీ కూడా తమ మేనిఫెస్టోలో చేర్చకపోతే పార్లమెంటు ఎన్నికలను బహిష్కరించి మాలీల ఐక్యత చాటి ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని మాలీకులస్తులకు సూచించారు.

లింగి వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొద్ది రోజుల క్రితం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించగా వచ్చిన ఆదాయంతో గురువారం లింగి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక సేవ చేయాలనే అలవాటును పెంచాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్ర కుమార్, రాజేష్, సుమలత, స్వప్న, నాగేందర్, అంబాజీ పాల్గొన్నారు.

ఎలాంటి ఫీజులు లేకుండా ఎల్ఆర్ఎస్ చేయాలి

- మాజీ మంత్రి జోగురామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలాంటి ఫీజులు లేకుండా ఎల్ఆర్ఎస్ చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. కాంగ్రెస్ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎల్ఆర్ఎస్ ఉచితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ఎల్ఆర్ఎస్‌కు ఎలాంటి ఫీజు ఉండదని ప్రకటించారని తెలిపారు. కానీ ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజులు అడుగుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది ఉంటే, జిల్లాలో 19 వేల 430 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరిపై రూ.40 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజలకు అండగా ఉంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. శ్రేణులు కూడా గ్రామాల్లో పర్యటిస్తు గృహజ్యోతి ఎంత మందికి వర్తిస్తుంది, గ్యాస్ సబ్సిడీ ఎంత మందికి పడిందో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ అబద్దాలు హామీలపై బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ, మున్సిపల్ చైర్మన్లు మనోహర్, జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు రోకండ్ల రమేష్, సాజిదొద్దిన్, నారాయణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులర్పించిన కలెక్టర్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజర్షి షా గురువారం మండలంలోని హీరాపూర్ అమరవీరుల స్థూపాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అమరవీరుల సంఘటనను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, స్థానిక పంచాయతీ ఈఓ సంజీవ్ రావ్ ఉన్నారు.

వేసవిలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని సిద్ధి వినాయక ట్యాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే తాను గతంలో వారిచ్చిన మాట ప్రకారం అసోసియేషన్ సభ్యులకు తన స్వంత ఖర్చుతో రూ.10 లక్షల భీమా చేయించి వారికి భీమా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తాను చేసిన వాగ్దానం ప్రకారం సంఘం సభ్యులకు అందరికి పోస్టల్ ఇన్సూరెన్ పథకం ద్వారా రూ.10 లక్షల భీమా చేయించానని తెలిపారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-తాంసి

యువత నేరాలవైపు వెళ్లకుండా నియంత్రణకు పోలీస్ వ్యవస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటిసారి స్టేషన్ సందర్శనకు వచ్చిన ఆయనకు సిబ్బందితో పాటు గ్రామ ప్రముఖులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏండ్ల క్రితం ఇదే స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి మళ్లీ డీఎస్పీగా రావడం సంతోషంగా ఉందన్నారు. గత రాత్రి మండల కేంద్రంలోని వైన్ షాపులో జరిగిన దొంగతనంలో ముగ్గురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి, యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందులో ఆదిలాబాద్ రూలర్ సీఐ ఫణిదర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉచిత శిక్షణ దరఖాస్తులకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులకు గడువు పొడగించినట్లు జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు మార్చ్ 12 వరకు స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ 13 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు.

పీఎం విశ్వకర్మ పథకం సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో లబ్దిదారులను గుర్తించడంపై అధికారులకు నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం జిల్లాలోని 334 గ్రామపంచాయతీలు, 2 పురపాలక సంఘాల పరిధిలో 18 రకాల చేతి వృత్తుల వారి నుండి దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన వారిని గుర్తించి వివరాలను జిల్లా స్థాయి అమలు కమిటీకి సమర్పించాలన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి 18 సంవత్సరాలు నిండిన వారు, కుటుంబంలో ఒకరికి పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, మొబైల్ నెంబరు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు వివరాలతో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీలలో 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. హరితహారం క్రింద నాటిన మొక్కలను కాపాడాలని, జీపీల్లో ప్రతిరోజు తడిపొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. వైకుంఠధామాలలో సౌకర్యాలు కల్పించి వినియోగించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతుల కల్పనపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీఓ భిక్షపతి, ఎల్‌డీఎం కోవ హనుమంతరావు, పరిశ్రమల శాఖ జీఎం రఘు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం శిక్షకులు రాజేష్ యాదవ్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీపీఓలు ఉమర్ హుస్సేన్, సురేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ, గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చేస్తాం

- ఫిల్టర్ బెడ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



నీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అనేక చోట్ల పైప్లైన్ సక్రమంగా వేయకపోవడంతో నీటి ఎద్దడి ఉందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్ వాటర్ ట్యాంక్‌ను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. పట్టణంలో నీటిని అందించేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్ కారణంగా మున్సిపల్ పైప్‌లైన్ డ్యామేజ్ అయినట్లు దృష్టికి వచ్చింది. దీంతో వెంటనే మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రణాళిక ప్రకారం పైప్ లైన్ వేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి ప్రారంభం అయిందని తమ దృష్టికి వచ్చిందన్నారు. వారం పది రోజుల్లో వాటన్నీటికి గుర్తించి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, రాజేష్, ఈఈ తిరుపతి, ఏఈ అరుణ్ కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

పారిశ్రామిక వేత్తలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టణంలోని ఓ హాలులో జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్‌తో పాటు అతిథులకు పులామొక్కలు అందించి స్వాగతించారు. అనంతరం జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేల పారిశ్రామిక వేత్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఐటీఐ వారు తరచూ అప్రెంటిస్ షిప్ మేళా ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులు వృద్ధి చేసుకుంటూ యువతకు ఉపాధి అవకాశాలు చూపి జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ రిజినల్ డైరెక్టర్ సీతారాములు, ప్రిన్సిపల్ సుజాత, శిక్షణ అధికారి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, పారిశ్రామిక వేత్తలు, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ ఉచితం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌లో ఉచితంగా ప్లాట్లను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాయకులతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 2022 సంవత్సరం నుండి ఎల్ఆర్ఎస్ అమలు చేసేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ ఎంఎస్ 135ను విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం భూ వైశాల్యానికి అనుగుణంగా స్లాబులు నిర్ణయించి పేద, మధ్య తరగతి, మురికి వాడలో ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములలో ఉన్నవారికి అందుబాటు ధరలలో భూమిని(ప్లాట్లను) క్రమబద్ధీకరణ చేసుకొనుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఆమోదం పొందని ప్లాట్లు, లే అవుట్లను క్రమ బద్ధీకరించడానికి, పౌరులకు ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి, మెరుగైన జీవన నాణ్యత కోసం అప్పటి ప్రభుత్వం ప్రతిపాధించిందని తెలిపారు. అయితే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌లో ఉచితంగా పట్టాలు ఇస్తామని ప్రకటించిందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. హామీకి విరుద్ధంగా రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం మోసే జీవోను తీసుకువచ్చిందని విమర్శించారు. సామాన్యులకు నష్టం కలిగించే జీఓని వెంటనే రద్దు చేయాలనీ, ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్, జైనూర్ మండల అధ్యక్షులు గంధం శ్రీనివాస్, ఇంతియాజ్ లాల, రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు బురస పోచయ్య, పీఏసీ చైర్మన్ అలీబిన్ అహ్మద్, మేర సంఘం నాయకులు అశోక్, నాయకులు నిసార్, జీవన్ సాంగ్డే, భీమేష్, శంకర్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎలక్టోరల్ బాండ్ల వివరాలను తెలియజేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిన ఎస్‌బీఐ మోడీ ప్రభుత్వ ఒత్తిడి కారణంగా జూన్ వరకు సుప్రీంలో సమయం అడగడం విడ్డూరంగా ఉందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల బహిర్గతం విషయంలో బీజేపీ, ఎస్‌బీఐల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం శివాజీ చౌక్‌లోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, ఎస్‌బీఐ బ్యాంక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఎలక్టోరల్ బాండ్లను మార్చి 6 వరకు బహిర్గతం చేయాలని ఆదేశించిందన్నారు. కానీ ఎస్‌బీఐ బ్యాంక్ వారు ఇప్పటి వరకు బహిర్గతం చేయలేదన్నారు. దేశ వ్యాప్తంగా ఆయా పార్టీలకు సంబంధించి రూ.12 వేల కోట్ల బాండ్లు ఉంటే, కేవలం బీజేపీకి సంబంధించి రూ.2,655 కోట్ల బాండ్లు ఉన్నాయని ఆరోపించారు. ఆన్‌లైన్ యుగంలో వివరాలు తెలియజేడానికి ఎస్‌బీఐకి జూన్ వరకు సమయం ఎందుకు అవసరమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, నాయకులు నగేష్, షాకిల్, ముఖీం, పూసం ప్రభాకర్, ఉయిక ఇందిరా, లత, మీరాబాయి, సుమ, సోనియా పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-నార్నూర్

నేటి సమాజంలో మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోని అన్ని రంగాల్లో రాణించాలని మాజీ సర్పంచ్ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ప్రజా ప్రతినిధులకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీటీసీలు పరమేశ్వర్ చంద్రకళ, ఆబేదా ఖానం, నాయకులు కనక ప్రభాకర్, షేక్ దాదే అలీ, మహేందర్, కరీం ఖాన్, సురేందర్, శశిధర్, రాజేంద్ర కోటి, సచిన్ జాదవ్, మాణిక్ రావు పాల్గొన్నారు.

ఉన్నత చదువులు జీవితాన్ని మార్చేస్తాయి

నవతెలంగాణ-తలమడుగు

నేటి యువత ఇష్టపడి కష్టంతో చదివితే జీవితాన్ని మార్చేస్తుందని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రత్యేక అధికారి కాడే స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సాధికారత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుండి క్రమశిక్షణగా చదివి మంచి మార్గాన్ని ఎన్నుకుంటే అన్ని రంగాల్లో రాణించవచ్చన్నారు. నేటి పొదుపు రేపటి అవసరాలను తీరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు వెంకట్ రావు, ఉపాధ్యాయులు లలిత, వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్ర కుమార్, రాజేందర్, సుమలత, స్వప్న అంబాజీ, రాధిక పాల్గొన్నారు.

మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న వేతనాలు మాత్రం సక్రమంగా అందడం లేదని ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ నరేందర్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మూడు నెలల వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు మాత్రం రావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిని పెద్దన్నలా సంబోధించారన్నారు. రాష్ట్రానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి పెద్దన్న ఉంటూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిసెంబర్, జనరవి, ఫిబ్రవరి మూడు నెలలుగా వేతనాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను గుర్తించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని సీఎంను కోరారు. తాము ఏ ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తమ సమస్యల సాధన కోసమే ఆందోళన చేపట్టామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దొంతుల ప్రవీణ్, అనిల్, కిరణ్, రమణ, ప్రశాంత్, నవీన్, విష్ణు, విజయ్, అనుష, రణిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనం రూ.600కు పెంచాలి



నవతెలంగాణ-కడెం

ఉపాధి హామీ కూలీల రోజు వారి వేతనం రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సర్కారు ఉపాధి హామీ కూలీల బడ్జెట్‌లో కోతలు విధించి పనులు కల్పించడంలో వైఫల్యం చెందిందన్నారు. రోజుకు రూ.272 కూలీ చెల్లిస్తున్నామని అంటునే రూ.200 కూడా సరిగ్గా కూలీలకు చెల్లించడం లేదని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాది కూలీల వేతనం రోజుకు రూ.600 పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, పనిముట్లు గడ్డపార, తట్టా, పారా కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు డాకూరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఉట్నూర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘనట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం..సింగారే యోగ్‌రాజ్(40) డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై భార్యతో రోజు గొడవ పడేవాడు. గురువారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ జాదవ హరి నాయక్, మాజీ జెడ్పీటీసీ జగ్జీవన్ మృతునికి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తుల స్నానాల కోసం గోదావరిలో ఏర్పాట్లు

నవతెలంగాణ-ఖానాపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకొని గురువారం ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉత్తరవాహిని గోదావరిలో భక్తుల స్నానాల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గోదావరిలో పరిసరాలను శుభ్రం చేసి భక్తుల స్నానాల కోసం సౌకర్యాలు కల్పించారు. అంతే కాకుండా వృద్ధులు చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా హ్యాండ్ సేవర్‌లను ఏర్పాటు చేశారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ రాజుల సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, నాయకులు నాయిని సంతోష్, పరిమి సురేష్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి : జెడ్పీటీసీ



నవతెలంగాణ-బోథ్

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలోని పట్నాపూర్ గ్రామపంచాయతీలో అంగన్‌వాడి భవనాన్ని ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసి నిర్మించడం జరిగిందన్నారు. 17 సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవనానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి నిర్మించామన్నారు. పట్నాపూర్ గ్రామంలో రూ. 20 లక్షలతో హైమస్ లైట్, మురికి కాలువలు, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామస్తులు జెడ్పీటీసీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంద్రం సుగుణ, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు తోడసం కైలాష్, రమణగౌడ్ రవి, అంగన్‌వాడీ సుశీల, గ్రామస్తులు పాల్గొన్నారు.